ANN తెలుగు

Follow: @ANNTELUGU

26-08-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 232 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రేగాపై భగ్గుమన్న ఎమ్మెల్యే పాయం

- సీఎం రేవంత్ సునామీలో కాంతారావు కొట్టుకుపోయాడు
- మతి భ్రమించి పిచ్చికూతలు కూస్తున్నాడు
- కేసు పెట్టగానే పారిపోయిన బతుకు కాంతారావుది
- మతిస్థిమితం కోల్పోయి చిల్లర మాటలు
- సీఎల్పీలో మీడియా సమావేశం.. హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని, సీఎం రేవంత్ రెడ్డి పైన మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. మంగళవారం సీఎల్పీ లో నిర్వహించిన మీడియా సమావేశంలో 2023లో జరిగిన ఎన్నికల్లో రేగా కాంతారావును పినపాక ప్రజలు కట్టకట్టి గోదావరిలో విసిరేశారని, కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేస్తే పార్టీ కార్యకర్తలు ఆయన గడ్డలూడదీసి పంపారని పాయం వెంకటేశ్వర్లు ఫైర్ అయ్యారు. 2009లో రేగా కాంతారావు ముఖం తెలియకపోయినా కాంగ్రెస్ కార్యకర్తలు గెలిపించారని, పార్టీ కార్యకర్తలు కష్టపడి గెలిపిస్తే వాళ్ల విశ్వాసాన్ని దెబ్బతీశారని ఆయన మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### మూసీ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం చేయాలి

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలని సూచన
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

04



### సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు లోకేష్ శంకుస్థాపన

- రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 4 వేల మందికి పైగా ఉపాధి
- సుజ్లాన్ భాగస్వామ్యంతో 12 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

02



### ఏకగ్రీవం జరిగితే ఎమ్మెల్యే టికెట్ మరిచిపోవాల్సిందే

- అక్రమాలపై పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి
- జగన్ సంచలన ప్రకటన

03



### రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది

- పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులతో రైతుల ఆదాయం పెంచాలి
- పసుపు రైతుల ముఖాముఖిలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను ప్రారంభించిన గవర్నర్

02

### ఏపీఎల్ మహిళా క్రికెటర్ల వేలం

04




### బలిపీఠంపై రోగుల ప్రాణాలు

- 'స్వర' ఆసుపత్రిలో మృత్యు మృదంగం.
- 9 మంది వైద్యులపై క్రిమినల్ కేసులు
- విజయవాడలో వెలుగు చూసిన దారుణం.
- నకిలీ రిజిస్ట్రేషన్లతో రోగుల ప్రాణాలతో చెలగాటం.
- తల్లి మృతిపై కుమారుడి న్యాయపోరాటం.
- బట్టబయలైన కార్పొరేట్ ఆసుపత్రి చీకటి కోణాలు.

02

# ఆ ఇద్దరూ ఔట్



## కొండా సురేఖ మంత్రి పదవి కట్

- చిన్నారెడ్డి ప్లానింగ్ బోర్డు పదవి ఊస్ట్
- క్రమశిక్షణా సంఘం సిఫార్సు
- ఎన్నిసార్లు హెచ్చరించినా తీరుమారడం లేదు
- పీసీసీ చీఫ్ మహేష్, ఇన్ ఛార్జి మీనాక్షిలకు మల్లురవి కమిటీ నివేదిక

**హైదరాబాద్, మహా :** వివాదాస్పద తీరు వ్యవహారంలో మంత్రి కొండా సురేఖను క్యాబినెట్ నుండి తప్పించాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పార్టీ హైకమాండ్ కు సిఫార్సుచేసింది. ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి నేరుగా హైకమాండ్ నే తప్పుపట్టినందున ఆయనను ప్రభుత్వపదవి నుండి తప్పించాలని క్రమశిక్షణా కమిటీ నివేదికలో పేర్కొంది. దీనిని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కు, ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కు క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యాంమోహన్ అందజేశారు. ఈ నివేదిక సంచలనంగా మారింది. కేవలం ప్రభుత్వ పదవుల కత్తిరింపుతోనే సరిపెడతారా? లేక చర్యలు తీసుకునేందుకు నేతలను ఢిల్లీకి పిలుస్తారా? అన్నదానిపై చర్చలు సాగుతున్నాయి. కొండా సురేఖ వ్యవహారం పార్టీకి డ్యామేజ్ జరుగుతోందని మంత్రులు, నేతలంతా అభిప్రాయపడుతుండడంతో.. వారు పార్టీలో ఒంటరిగా మిగిలినట్లు కనబడుతోంది.

**క్రమశిక్షణే ముఖ్యం**

వ్యక్తుల కంటే పార్టీ క్రమశిక్షణే ముఖ్యమని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మిగతా 2వ పేజీలో





## హరీశ్ రావు 'హైటెక్' అవినీతి

- మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు
- గత ప్రభుత్వంలో హరీశ్ రావు ఆర్థిక ఆరోగ్యం ఊహించనంతగా మెరుగుపడింది
- గత తప్పులు ఎత్తిచూపుతూ పొంగులేటి ఫైర్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు హైటెక్ అవినీతికి పాల్పడ్డారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర ఆరోపణలు చేశారు. గత కొద్దిరోజులుగా 22ఏ పేరుతో హరీష్ రావు అబద్దాలు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడుతున్న పొంగులేటి మంగళవారం తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వైద్య శాఖ మంత్రిగా హరీష్ రావు ఆసుపత్రులతో వ్యాపారం చేశాడన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ఆసుపత్రులతో వ్యాపారం చేయడం, అది కూడా ఊరూ పేరూ లేని కంపెనీ పేరుతో జరగడం వెనుక అధికార దుర్వినియోగం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హరీశ్ రావు ఆర్థిక ఆరోగ్యం ఊహించనంతగా మెరుగుపడిందని మంత్రి విమర్శించారు. గతంలో రబ్బరు చెప్పులు వేసుకుని తిరిగిన వ్యక్తి.. ఇప్పుడు రాష్ట్రం మొత్తం ఎన్నికల ఖర్చు భరించేంత స్థాయికి ఎదిగాడని ఆరోపించారు. పాల కంపెనీ.. హరీశ్ రావు అవినీతి సామ్రాజ్యంలో ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని అన్నారు. ఆ అవినీతి సామ్రాజ్యాన్ని తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటపడుతున్నాయన్నారు. ఎలాంటి తప్పు చేయకపోతే ఆ కంపెనీ వెబ్ సైట్ ను ఎందుకు మూశారని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ఓట్ల కోసం ప్రజలను రెచ్చకొట్టడం హరీష్ రావుకు మొదట్నుంచీ అలవాటేనని చెప్పారు.

### దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

02

### డిసెంబర్‌లో గ్రేటర్ వార్

- జీహెచ్ఎంసీ ఎన్నికలపై సీఎం చూపు
- ఇప్పటికే డివిజన్ల వారీగా గ్రౌండ్ వర్క్
- గ్లోబల్ సమ్మిట్ ముగియగానే.. షెడ్యూల్
- జూన్ లో సిటీలో వరుస పర్యటనలు చేసిన సీఎం
- గ్రేటర్ తో పాటు ఖమ్మం, వరంగల్ కార్పోరేషన్లు కూడా..

02






### జోడిమెట్లలో జోరుగా

# అక్రమ షెడ్ల నిర్మాణం..!

### జీరో పర్మిషన్ తో సాగుతున్న వైనం...!

- హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఆనుకుని యథేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణ పనులు..!
- అంతా చైన్‌మెన్ల కనుసన్నల్లోనే..!
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..!
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!

**మహా, ఘట్కేసర్:** మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం వార్డ్ పరిధిలోని జోడిమెట్లలో అక్రమ షెడ్ల నిర్మాణాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తూ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఒక షెడ్డు, తాజా కిచెన్ కు ఎదురుగా మిగతా 2వ పేజీలో

### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

**15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి**

- ఈ నెల 27 నుంచి 30 వరకు పారదర్శకంగా డ్రా
- మరో 4 నియోజకవర్గాల్లో దరఖాస్తులకు ఆహ్వానం
- సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

03



### సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పూర్తిచేయాలి

- యుద్ధప్రాతిపదికన ముందుకెళ్ళాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- ఏడాదిలో దేవాదుల- మంత్రి పొంగులేటి

03

# ఆ ఇద్దరూ ఔట్

( మొదటి పేజీ తరువాయి )



చైర్మన్, ఎంపీ మల్లు రవి అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన మంత్రి కొండా సురేఖ ను మంత్రి పదవి నుంచి, చిన్నారెడ్డి ని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించాలని అధిష్టానానికి నివేదిక పంపినట్లుగా తెలిపారు. ఆ ఇద్దరి వల్ల పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, క్రమశిక్షణా చర్యలు అత్యంత కఠినంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నివేదిక ఇచ్చామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గౌరవం దెబ్బతీసే పనులు ఎవరూ చేయవద్దని, రాబోయే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడొద్దని నేతలకు సూచించారు. ముఖ్యంగా పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన చిన్నారెడ్డి మరింత బాధ్యతాయుతంగా ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై చర్యలు తీసుకోకపోతే పార్టీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టీపీసీసీ చీఫ్ ఈ అంశాలన్నింటినీ మీనాక్షి నటరాజన్‌కు వివరిస్తారని, ఆమె వాటిని ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తారని మల్లు రవి స్పష్టం చేశారు.

**ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదు..**

కొండా సురేఖ, చిన్నారెడ్డి విషయంలో తమ కమిటీ చేయాల్సిన పనిని పూర్తి చేసిందని, ఇకపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలని మల్లు రవి అన్నారు. గతంలో కొండా సురేఖను హెచ్చరించినప్పటికీ ఆమె తీరు మారకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలనూ సమానంగా చూస్తుందని, ఇక్కడ ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదని స్పష్టం చేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణల ఆధారంగానే నివేదికను తయారు చేశామని పేర్కొన్నారు. హద్దులు దాటిన నేతలందరికీ ఒక స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాలని అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు.

**అలా చేస్తే.. నాకు కూడా నోటీసులు పక్కా**

తన నివేదికలో ఏ విషయాలు ఉన్నాయో ముందే చెబితే, అధిష్టానం నుంచి తనకు కూడా నోటీసులు వస్తాయని మల్లు రవి సెటైర్లు వేశారు. ఎంతటి వారైనా పార్టీ అంతర్గత వ్యవహారాలను బయటపెట్టవద్దని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లుగా తెలిపారు. తనను ఎవరూ వ్యక్తిగతంగా కలవలేదని, గాంధీభవన్‌కు వచ్చి వివరణ లేఖ ఇచ్చి వెళ్లారని పేర్కొన్నారు. ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి ఇవ్వలేదని, ఇది పార్టీకి సంబంధించిన విషయం కాబట్టి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు మాత్రమే అందజేశామని వివరించారు. మీడియా కూడా ఈ విషయంలో ఊహాజనిత కథనాలను రాయవద్దని మల్లు రవి విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది

నిజామాబాద్, మహా : రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, బలమైన మార్కెట్ అనుసంధానంతో రైతుల ఆదాయాన్ని పెంచాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో ''సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమంటోలు అందించి అభినందించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టంతో ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు. ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో ఇది సాకారం అయ్యిందన్నారు. సాగును లాభదాయకంగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. పసుపు కేవలం వ్యవసాయ ఉత్పత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత, నిత్య జీవితంతో ముడిపడిన విలువైన సంపద అని గవర్నర్ పేర్కొన్నారు. భారతదేశ వ్యవసాయ వారసత్వానికి పసుపు ప్రతీకగా నిలుస్తోందన్నారు.భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారుగా కొనసాగించడంతో పాటు పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమని గవర్నర్ అన్నారు. పసుపు పండించే రైతుకు కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత పసుపుకు ప్రత్యేక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు నాణ్యత పెంపు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటకోత అనంతర నిర్వహణపై శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. బాయిలర్లు, పాలిషర్లు, చిన్నతరహా ప్రాసెసింగ్ యూనిట్లు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు విలువ ఆధారిత ఉత్పత్తుల దిశగా దోహదపడతాయని తెలిపారు. సహజ వ్యవసాయం, ఎగుమతుల ప్రోత్సాహానికి దోహదపడే దూరదృష్టితో 'సునహరీ మిట్టీ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రసాయన ఎరువులు, ఇతర ఇన్‌పుట్లపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా నేల సారాన్ని కాపాడటంతో పాటు.. పర్యావరణ పరిరక్షణ, సాగు వ్యయాన్ని తగ్గించేందుకు సహజ వ్యవసాయం తోడ్పడుతుందని అన్నారు. అవశేష రహిత, నాణ్యమైన పసుపుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, నాణ్యతకు ప్రాధాన్యమిస్తే రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు విదేశీ మార్కెట్లకు చేరుకునే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలు రైతులను నేరుగా దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులతో అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తాయని గవర్నర్ అన్నారు. మార్కెట్ అవసరాలు, నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు.. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. రైతులు, శాస్త్రవేత్తలు, ఎగుమతిదారులు, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమష్టిగా పనిచేస్తే భారత పసుపును ఆసియా, యూరప్, అమెరికా మార్కెట్లలో మరింత బలోపేతం చేయవచ్చని గవర్నర్ అన్నారు. రైతులు కేవలం పంట ఉత్పత్తి దారులు మాత్రమే కాదని.. దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని గవర్నర్ పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, నాణ్యమైన పంటను పండిస్తూ, సమష్టి మార్కెటింగ్ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. "అన్నదాత సుఖీభవ" స్ఫూర్తితో రైతు సంపన్నుడిగా, నేల ఆరోగ్యంగా, ప్రపంచ మార్కెట్‌లో భారత్ అగ్రగామిగా నిలిచే వ్యవసాయ వ్యవస్థను నిర్మించాలి అని గవర్నర్ ఆకాంక్షించారు. ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ, ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగు దశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగాజాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో కేంద్రం నెరవేర్చిందన్నారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. పసుపు క్వింటాలు ఇచ్చే రేటు గతం కంటే పెరిగిందన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నగర మేయర్ ఉమారాణి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పి. రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీ శ్రీ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పాల్గొన్నారు.

## జోడిమెట్లలో జోరుగా
# అక్రమ షెడ్ల నిర్మాణం..!

( మొదటి పేజీ తరువాయి )





మరో షెడ్డు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ తతంగమంతా నడుస్తోందనే ఆరోపణలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను బూచీగా చూపి సామాన్యులను వేధించే టౌన్ ప్లానింగ్ అధికారులు.. ఇక్కడి అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణలు బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి.

**హైవే పక్కనే యథేచ్ఛగా నిర్మాణ పనులు .. పట్టించుకోని అధికారులు!**

సాధారణంగా జాతీయ రహదారుల పక్కన ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా మున్సిపల్ చట్టాలతో పాటు, నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారం కఠినమైన అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, జోడిమెట్లలో కొందరు అక్రమార్కులు ఈ నిబంధనలన్నీ తుంగలో తొక్కారు. ఎలాంటి పర్మిషన్లు లేకుండానే అక్రమ షెడ్ల నిర్మాణం రాత్రికి రాత్రే శరవేగంగా జరుగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా పనులు జరుగుతున్నా, కనీసం నోటీసులు ఇచ్చేందుకు కూడా టౌన్ ప్లానింగ్ సిబ్బంది ముందుకు రాకపోవడం గమనార్హం.

**అంతా 'చైన్‌మెన్ల కనుసన్నల్లోనే !**

ఈ అక్రమ నిర్మాణాల వెనుక మున్సిపాల్ సర్కిల్ లో కీలకంగా వ్యవహరించే కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది (చైన్‌మెన్లు) చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులకు, సదరు బిల్డర్లకు మధ్య వీరే మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ 'మామూళ్ల' పంపిణీ పూర్తి చేసినట్లు మున్సిపల్ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన చైన్‌మెన్లు లంచాల మత్తులో జోగుతూ, అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు ఏసీ రూములకే పరిమితం కావడంతో క్షేత్రస్థాయిలో చైన్‌మెన్ల ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

**సామాన్యుడికి ఒక న్యాయం.. బడా బాబులకు ఒక న్యాయమా?**ఘట్కేసర్ సర్కిల్ లో ఓ సామాన్య పౌరుడు తన సొంత స్థలంలో చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా, రేకుల షెడ్డు వేసుకోవాలన్నా టౌన్ ప్లానింగ్ అధికారులు వాలిపోతారు. బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బీఆర్ఎస్) ప్లాన్ అప్రూవల్స్ అంటూ నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తారు. కానీ, కమర్షియల్ జోన్ లో హైవే పక్కనే లక్షలాది రూపాయల విలువైన భారీ షెడ్లను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే అధికారులు కళ్ళున్నా గుడ్డివారిలా వ్యవహరించడం వెనుక ఉన్న 'అసలు రహస్యం' ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వ ఖజానాకు భారీ గండి.. ఉన్నతాధికారులు స్పందించేనా..**

కమర్షియల్ నిర్మాణాల ద్వారా మున్సిపాలిటీకి ప్లాన్ అప్రూవల్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీల రూపంలో భారీగా ఆదాయం రావాల్సి ఉంది. కానీ ఈ 'జీరో పర్మిషన్' దందా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రైవేటు వ్యక్తులు జేబులు నింపుకుంటున్నారు. ఇప్పటికైనా, డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి జోడిమెట్ల వద్ద జరుగుతున్న ఈ అక్రమ షెడ్ల నిర్మాణాలని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, తక్షణమే కూల్చివేత చర్యలు చేపట్టి, ఇందుకు సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారుల పై, చైన్‌మెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణ
# వేగవంతం చేయాలి
### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

మహా, తెలంగాణ బ్యూరో : మూసీ ప్రాజెక్టు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవిలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌తో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణపై స్పష్టమైన విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భూసేకరణలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. మూసీ ప్రాజెక్టు రెండో దశకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం తక్కువ వడ్డీకి రుణాల సమీకరణపై దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలన్నారు. టీడీఆర్‌పై ప్రతీ వారం సమీక్ష జరగాలని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, ఆర్వీ కర్ణన్, వినయ్ కృష్ణా రెడ్డి, సృజన, నారాయణ రెడ్డి, మను చౌదరి, నరసింహ రెడ్డి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

# సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు లోకేష్ శంకుస్థాపన




రాయదుర్గం, మహా : పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్టులు ఈ ప్రయాణంలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతున్నాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం, కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ.. సుజ్లాన్‌తో ఏపీకి ఉన్న రెండు దశాబ్దాల బంధం పునరుద్ధరణ కావడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే దానిపై నమ్మకం ఉంచి, దేశ ఇంధన స్వావలంబనకు పునాదులు వేసిన దివంగత తులసి తంతిని ఈ సందర్భంగా స్మరించుకోవాలని లోకేశ్ అన్నారు. ఆయన దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడిందని గుర్తుచేశారు. భారత పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థ సుజ్లాన్ అని కొనియాడారు. ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, నిబద్ధతతో కూడిన సంస్కృతితో సుజ్లాన్ సంస్థ నిలదొక్కుకుందని ప్రశంసించారు. గత ఐదేళ్లలో (201924) రాష్ట్రంలో పవన విద్యుత్ రంగం పూర్తిగా నిలిచిపోయిందని, కేవలం 6 మెగావాట్ల సామర్థ్యం మాత్రమే అదనంగా చేరిందని లోకేశ్ విమర్శించారు. నేడు ఒక్క అనంతపురంలోనే సుజ్లాన్ యూనిట్‌కు ఏటా 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉందని, ఇక్కడ ప్రత్యక్షంగా 1,200 మందికి ఉపాధి లభిస్తోందని, వారిలో 70 శాతానికి పైగా స్థానికులేనని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలు సృష్టించిందని వివరించారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల ద్వారా 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. దీని కోసం సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడి వస్తుండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

## రేగాపై భగ్గుమన్న
# ఎమ్మెల్యే పాయం

( మొదటి పేజీ తరువాయి )

విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పైసా పైసా కూడబెట్టి ఆఫీసు కట్టుకుంటే, దాన్ని కూడా కబ్జా చేసి రంగులు మార్చిన వ్యక్తి రేగా కాంతారావు అని పాయం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. కేసు పెట్టగానే పారిపోయిన బతుకు రేగా కాంతారావుదని, ఆయనను చూసి పినపాక ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రేగా కాంతారావు కామం కాంతారావు అని, అమ్మాయిని మోసం చేసి వచ్చి సిగ్గులేకుండా రంగులు చల్లుకుంటున్నారన్నారు. పినపాకలో రేగా లాంటి చిల్లరగాళ్లకు స్థానం లేదని, మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని పాయం వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సునామీలో రేగా కాంతారావు ఇప్పటికే కొట్టుకుపోయాడని, అడ్డగోలుగా మాట్లాడితే ఆయనకు ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రెండు సార్లు కాంగ్రెస్ కార్యకర్తల బిక్షమీదే గెలిచాడన్నారు. సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.

# దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

హైదరాబాద్, మహా : తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రెండో రోజే విరమించారు. దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు. సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు. అనంతరం, పార్టీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్.. రాంచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.



# బలిపీఠంపై రోగుల ప్రాణాలు

- **'స్వర' ఆసుపత్రిలో మృత్యు మృదంగం.**
- **9 మంది వైద్యులపై క్రిమినల్ కేసులు.**
- **విజయవాడలో వెలుగుచూసిన దారుణం.**
- **నకిలీ రిజిస్ట్రేషన్లతో రోగుల ప్రాణాలతో చెలగాటం.**
- **తల్లి మృతిపై కుమారుడి న్యాయపోరాటం.**
- **బట్టబయలైన కార్పొరేట్ ఆసుపత్రి చీకటి కోణాలు**




విజయవాడ, మహా : ప్రాణాలు నిలబెట్టాల్సిన వైద్యులే యమకింకరులుగా మారితే? రోగాలను నయం చేయాల్సిన ఆసుపత్రులే మృత్యుశాలలుగా దర్శనమిస్తే? సామాన్యుడికి దిక్కెవరు? దేవుడితో సమానంగా పూజలందుకునే వైద్య వృత్తికే మాయని మచ్చ తెస్తూ, పవిత్రమైన ప్రాణాలను వ్యాపార వస్తువులుగా మార్చేసిన ఓ కార్పొరేట్ వైద్య మాఫియా బాగోతం ఇది. విజయవాడలోని ప్రముఖ 'స్వర' ఆసుపత్రి వేదికగా జరిగిన ఈ దారుణ కాండ ఇప్పుడు యావత్ రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. అభాగ్యుల ప్రాణాలతో చెలగాటమాడిన వైద్యుల నిర్వాకం వెలుగులోకి రావడంతో ప్రజానీకం నివ్వెరపోతోంది. పైకి కార్పొరేట్ హంగులు, లోపల మాత్రం అర్హత లేని వైద్యులతో ప్రాణాల వేట సాగిస్తున్న స్వర ఆసుపత్రి బాగోతంపై ఇప్పుడు న్యాయస్థానం కొరడా ఝుళిపించింది.

**పవిత్ర వృత్తికి మాయని మచ్చ**

విజయవాడలోని స్వర ఆసుపత్రి చుట్టూ ఇప్పుడు క్రిమినల్ ఉచ్చు బిగుసుకుంటోంది. ఏకంగా తొమ్మిది మంది ప్రైవేట్ ప్రాక్టీస్ డాక్టర్లపై ఫోర్జరీ, క్రిమినల్ కుట్ర, బెదిరింపుల కింద కేసులు నమోదు కావడం వైద్య రంగంలో సంచలనంగా మారింది. బాధితుల ఆర్తనాదాలు విన్న న్యాయస్థానం తీవ్రంగా స్పందించడంతో, సత్యనారాయణపురం పోలీసులు ఏకంగా కోర్టు ఆదేశాలతో ఈ క్రిమినల్ కేసులను నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

**కళ్లెదుటే కన్నతల్లి ప్రాణాలు గాలిలోకి.**

ఈ దారుణానికి బీజం పడింది 2023 అక్టోబర్ 27వ తేదీన. అనారోగ్యంతో బాధపడుతున్న అప్పాయమ్మ అనే వృద్ధురాలు మెరుగైన చికిత్స కోసం ఎంతో ఆశతో స్వర ఆసుపత్రి గడప తొక్కారు. కానీ, ఆమె పాలిట ఆ ఆసుపత్రే ప్రాణ సంకటంగా మారుతుందని ఆ కుటుంబం కలలో కూడా ఊహించలేదు. ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి వైద్యుల కఠినాత్మక నిర్లక్ష్యం, కనీస బాధ్యతారాహిత్యం కారణంగా కళ్లెదుటే ఆ కన్నతల్లి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

**నిలువునా ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం**

ఆసుపత్రిలో అప్పాయమ్మ గుండె, ఊపిరితిత్తులు, నరాలకు సంబంధించిన తీవ్రమైన సమస్యలతో మృత్యువుతో పోరాడుతున్న సమయంలో యాజమాన్యం ప్రదర్శించిన నిర్లక్ష్యం అంతా ఇంతా కాదు. అత్యవసర సమయంలో వైద్యం అందించేందుకు నిపుణులైన కార్డియాలజిస్ట్, పల్మనాలజిస్ట్‌లను తక్షణమే పిలిపించాలని బాధిత కుమారుడు ఎంత ప్రాధేయపడినా అక్కడి సిబ్బంది కనీసం స్పందించలేదు. ఛాతీ ఎక్స్‌రేలో స్పష్టంగా ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించినప్పటికీ, కనీస చికిత్స అందించడంలో అక్కడి వైద్యులు దారుణంగా విఫలమయ్యారు.

**తల్లి మృతిపై కొడుకు న్యాయపోరాటం**

తల్లి మరణంతో గుండెలు పగిలిన ఆ కుమారుడు కృష్ణమూర్తి మౌనంగా రోదించలేదు. తన తల్లికి పట్టిన గతి మరే అభాగ్యుడికీ పట్టకూడదని, ఈ కసాయి వైద్యుల బండారం బయటపెట్టాలని ఆయన చట్టపరమైన పోరాటానికి సిద్ధమయ్యారు. ఆసుపత్రి యాజమాన్యం బెదిరింపులకు భయపడకుండా నేరుగా న్యాయపోరాటానికి దిగిన ఆయన, మూడవ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించి ఆసుపత్రి చీకటి కోణాలను ఆధారాలతో సహా న్యాయమూర్తి ముందు కుండబద్దలు కొట్టారు.

**నకిలీ సర్టిఫికెట్లు...రోగులతో చెలగాటం**

ఈ దర్యాప్తులో అత్యంత దిగ్భ్రాంతి కలిగించే మరో భయంకరమైన వాస్తవం ఏమిటంటే.. మృతురాలికి వైద్యం చేసిన డాక్టర్ల అర్హతలే ప్రశ్నార్థకంగా మారడం. చెల్లుబాటు అయ్యే మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా, కనీస అర్హత, అనుభవం లేని నకిలీ వైద్యులే ఈ ఆసుపత్రిలో రోగులకు చికిత్స అందిస్తున్నారని బాధిత కుటుంబం కోర్టులో సంచలన ఆరోపణలు చేసింది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కాసులకు కక్కుర్తి పడుతున్న స్వర ఆసుపత్రి యాజమాన్యం అసలు రంగు దీంతో బట్టబయలైంది.

**కటకటాల వెనక్కి కసాయి వైద్యులు**

పక్కా ఆధారాలతో ఆగ్రహించిన న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు సీరియస్ గా రంగంలోకి దిగారు. ఫోర్జరీ, క్రిమినల్ కుట్ర తదితర తీవ్రమైన ఆరోపణలపై డాక్టర్ సాయి కృష్ణ ఆదిత్య, డాక్టర్ రాజీవ్ ప్రసాద్, డాక్టర్ పూర్ణ చంద్రరావు, డాక్టర్ విక్రమ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ స్వాతి రోజా, డాక్టర్ జ్యోతి శ్రీ, డాక్టర్ రాజేష్, డాక్టర్ ఏలేటి రాహుల్ సహా మొత్తం తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో దోషులకు కఠిన శిక్షలు పడితేనే సామాన్యులకు వైద్య వ్యవస్థపై నమ్మకం మిగులుతుంది.

## డిసెంబర్ లో
# గ్రేటర్ వార్

హైదరాబాద్, మహా : తెలంగాణ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ కు మూడేళ్ళు పూర్తి అవుతుండగా, గ్రేటర్ ఎన్నికలకు ఇది సరైన సమయంగా సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ నెలలో హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లతో పాటు మిగిలిన పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీఅర్బన్ లోకల్ బాడీ)లకు ఎన్నికలు నిర్వహించాలని సర్కారు భావిస్తోంది. దీనిపై కీలక నేతలతో సీఎం చర్చించారు. ఇప్పటికే ఇందిరమ్మ టవర్స్, గ్రేటర్ లో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం కావడం, డిసెంబర్ 7,8,9 తేదీల్లో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ తో పెట్టుబడుల ఆకర్షణ ద్వారా మరింత పాజిటివ్ వాతావరణం ఏర్పడుతుందని సర్కారు భావిస్తోంది. సర్ పూర్తయిన తర్వాత దసరా తర్వాత గ్రేటర్ వార్ ఉండబోతుందని మహా పత్రిక మూడు మాసాల క్రితమే చెప్పిన విషయం విదితమే. ఇపుడు అందుకు అనుగుణంగా సర్కారు అడుగులున్నాయి. జూన్ లో సిటీలో వరుస పర్యటనలు చేసి డెవలప్ మెంట్ వర్క్స్ కు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఇందిరమ్మటవర్స్ కు పలు నియోజకవర్గాల్లో శంఖుస్థాపనలు చేశారు.

వరంగల్, ఖమ్మం బల్దియా కూడా..

'సర్' ప్రక్రియ అక్టోబర్ 19వ తేదీతో పూర్తి కానున్న నేపథ్యంలో ఆ తర్వాత కాస్త సమయం తీసుకొని ఎన్నికలకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించగా మెజారిటీ స్థానాలు అధికార కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అప్పటికి జీహెచ్ఎంసీతో పాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల కాలపరిమితి పూర్తి కాకపోవడంతో వాటికి మాత్రం ఎన్నికలు నిర్వహించలేదు. వివిధ కారణాలతో కొత్తూరు, సిద్దిపేట, మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగలేదు. ఇప్పుడు వీటన్నింటికీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

మూడా.. ఒక్కటా

ఈ ఏడాది ఫిబ్రవరి 10తో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాలపరిమితి ముగిసింది. ఆ తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జీహెచ్ఎంసీని 3 మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్ కార్పొరేషన్‌ను కొనసాగిస్తూనే శివార్లలో విలీనమైన మున్సిపాలిటీలతో కలిపి కొత్తగా సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్లు ఒకే పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విభజన జరిగింది. వాస్తవానికి కాలపరిమితి ముగిసిన 6 నెలల్లోనే వీటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే పునర్ వ్యవస్థీకరణ కారణంగా ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది. ఇప్పుడు వీటితో పాటు మొదటి దశలో ఎన్నికల ప్రక్రియ పూర్తికాని పట్టణ స్థానిక సంస్థలకు డిసెంబర్ లో ఎన్నికలు నిర్వహించాలని సర్కార్ ఆలోచిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో సర్ ప్రక్రియ కొనసాగుతుండటంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది అంతా అందులోనే నిమగ్నమై ఉన్నారు. ఇది పూర్తయ్యాక కాస్త విశ్రాంతి ఇచ్చి, ఎన్నికలకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలిసింది. పైగా అప్పటికి వాతావరణం కూడా కాస్త అనుకూలిస్తుందని భావిస్తోంది. తాగునీటి సమస్య, విద్యుత్తు అంతరాయాలు కూడా చాలా మేర తగ్గే అవకాశం ఉంటుంది. అన్నింటి కంటే ముఖ్యంగా ఎన్నికలకు ప్రజలను సమాయత్తం చేయడానికి సమయం కూడా లభిస్తుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని డిసెంబర్‌లో ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ ను మూడు ముక్కలుగా చేయగా. మూడింటికి ఒకేసారి నిర్వహిస్తారా.. ముందు జీహెచ్ఎంసీ, తర్వాత సైబరాబాద్, మల్కాజ్ గిరి వేర్వేరుగా నిర్వహిస్తారా అన్నదానిపై రానున్నరోజుల్లో స్పష్టత రానుంది.




## నకిలీ ఆధార్‌తో ఇంటి స్థలం విక్రయం..?

- ఏడుగురు నిందితుల అరెస్టు
- నిందితుల నుంచి నగదు సెల్‌ఫోన్లు స్వాధీనం

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 25 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్గుల్ లో నకిలీ ఆధార్ కార్డు సృష్టించి ప్లాట్ విక్రయించిన ఘటన చోటుచేసుకుంది. రిటైర్మెంట్ ఉద్యోగి పేరిట ఉన్న ప్లాటుకు, కొందరు వ్యక్తులు నకిలీ ఆధార్ సృష్టించి, ఉద్యోగికి చెందిన స్థలాన్ని అక్రమంగా విక్రయించిన కేసులో, ఆదిభట్ల పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి కొంత నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బెంగళూరుకు చెందిన రిటైర్మెంట్ ఉద్యోగి ఆర్. తంగరాజ్, బాలాపూర్ మండలం, నాదర్‌గుల్‌లో కొనుగోలు చేసిన 300 గజాల స్థలాన్ని నకిలీ ఆధార్, తప్పుడు పత్రాలతో ఇతరులకు విక్రయించిన విషయం గత వారం పది రోజుల క్రితం జరిగినట్లు తెలుస్తోంది.? ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై రిటైర్మెంట్ ఉద్యోగి ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నకిలీ పత్రాలతో స్థలాన్ని విక్రయించిన వ్యవహారంలో తొమ్మిది మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.? అరెస్టు చేసిన వారిలో ఏడుగురిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మరో ఇద్దరి కోసం గాలిపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

- 15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి
- ఈ నెల 27 నుంచి 30 వరకు పారదర్శకంగా డ్రా
- మరో 4 నియోజకవర్గాల్లో దరఖాస్తులకు ఆహ్వానం
- సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహా నగరంలోని క్యూర్ పరిధిలో సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలలను నిజం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసిందని పేదవాడికి కూడా నగరంలో సొంత ఇల్లు ఉండాలని, ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని ఇందుకోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15 తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన .దరఖాస్తులపై 360 డిగ్రీల క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ. 10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. 27వ తేదీన రాయదుర్గం, కెపిహెచ్‌బి కాలనీ, మైలార్‌దేవరపల్లి, రెడ్ హిల్స్, 28న కౌకూర్, పాటిగెడ్డ,జల్‌పల్లి, కుల్సుంపుర , 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కోలనీ, బోయన్‌పల్లి, బండ్లగూడ (ఎల్ఐజి కాలనీ), నందిముసలిగుడ, 30వ తేదీన గాజుల రామారం, అంబర్ పేటలోని సిటీపోలీస్ లైన్స్, గడ్డిన్నారం, ఆర్&బి క్వార్టర్స్,పోచారం ( ఎల్ఐజి కాలనీ)లో లక్కీడ్రా నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక

క్యూర్ పరిధిలో కొత్తగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని తెలిపారు .ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో హయత్‌నగర్ గ్రామంలోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాన్‌పూర్ (ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలో (ఫలక్‌నుమా సమీపంలో) ఇళ్లు నిర్మించేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన ప్రజలు ఇందిరమ్మ టవర్స్ కోసం సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాలకు వర్తింపజేసిన నిబంధనలే ఈ కొత్త దరఖాస్తులకూ వర్తిస్తాయన్నారు. ఇందిరమ్మ టవర్స్ ప్రత్యేకత కేవలం అపార్ట్‌మెంట్‌లో ఒక ఇల్లు ఇవ్వడంలోనే లేదని నగరంలో విలువైన భూమిపై ఒక కుటుంబానికి శాశ్వత ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిపాదిత ఫ్లాట్ విస్తీర్ణం 525 చదరపు అడుగులు. అన్‌డివైడెడ్ షేర్ విధానంలో సుమారు 20-25 గజాల భూమిని లబ్ధిదారుల పేరుతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నామని ప్రాంతాన్ని బట్టి లబ్ధిదారులకు అందే భూమి విలువ రూ.60 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉండనుందన్నారు. ఇంత విలువైన ఆస్తిని పేద కుటుంబానికి అందించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తోందని లబ్ధిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలు మాత్రమే, అది కూడా నాలుగు విడతల్లో చెల్లించే విధంగా అవకాశం కల్పించామన్నారు.

జీవితాంతం అద్దె ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నుంచి ఒక పేద కుటుంబాన్ని బయటకు తీసుకువచ్చి, నగరంలోనే సొంతింటి యజమానిగా నిలబెట్టడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమన్నారు.

## అమెరికా పర్యటనపై సీఎం వ్యాఖ్యలు అర్ధరహితం

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**ఢిల్లీ, మహా :** అమెరికా పర్యటనపై సీఎం చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డిని కేంద్రం అడ్డుకుందని అనటం సరికాదన్నారు. కేంద్రం అనుమతి రాకుండానే ఆదరాబాదరాగా ముఖ్యమంత్రి పర్యటన పెట్టుకున్నారని, అమెరికా పర్యటనలో అర్హతలేని వ్యక్తులను కలవాలని రేవంత్‌రెడ్డి నిర్ణయించుకున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్, ఇతర దేశాల పర్యటనలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈసారి స్పష్టమైన కారణాల వల్లే విదేశాంగశాఖ అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తన పర్యటనపై రేవంత్‌రెడ్డి స్పష్టమైన వివరణ ఇవ్వలేదన్నారు. న్యూయార్క్ మేయర్ మమ్దానీని కలవాలని రేవంత్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు వార్తలు వచ్చాయని కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి, తనస్థాయికి తగిన వారితో చర్చించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లకుండా, కేవలం అధికారులను పంపించి కూడా పెట్టుబడులు సాధించవచ్చని కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

**సింగరేణి దుబారా ఖర్చులు తగ్గించాలి**

సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపులపైనా కిషన్‌రెడ్డి స్పందించారు. సింగరేణి సంస్థకు ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్ ఇప్పించామన్నారు. తాడిచర్ల2 గనులు, భద్రాద్రి జిల్లాలోని కోయగూడెం బ్లాక్3 కూడా సింగరేణికి ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. గతంలో ప్రైవేటు సంస్థకు ఇచ్చిన ఒప్పందాన్ని రద్దు చేసి సింగరేణికి ఇప్పించామని తెలిపారు. సింగరేణి సంస్థలో దుబారా ఖర్చులు తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. సింగరేణికి చెల్లించాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా చెల్లించాలని కోరారు.

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పూర్తిచేయాలి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం (ఆర్ అండ్ ఆర్), అటవీ శాఖ అనుమతుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, నిర్దేశిత ఆయకట్టుకు వేగంగా నీరందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. దేవాదుల ప్రాజెక్టును వచ్చే ఏడాది పూర్తిచేస్తామన్నారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రాజెక్టు పనులు వేగవంతం కావాలంటే భూసేకరణ ప్రక్రియను నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు ఒక సవాల్‌గా తీసుకుని పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పెండింగ్ అవార్డులను సకాలంలో పాస్ చేయాలని, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి స్థానిక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన టోకెన్లను త్వరితగతిన క్లియర్ చేయాలని పేర్కొన్నారు. అలాగే కలెక్టర్ల పీడీ ఖాతాల్లో ఉన్న నిధులను అర్హులైన రైతులు, నిర్వాసితులకు తక్షణమే చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించి సకాలంలో భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రక్రియలో అటవీ శాఖ అనుమతులు లేదా ఇతర భూసేకరణ సమస్యలు ఎదురైతే కలెక్టర్లు నీటిపారుదల శాఖ కార్యదర్శితో నిరంతరం సమన్వయం చేసుకోవాలని, క్లిష్టమైన అంశాలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని మంత్రి తెలియజేశారు.

**ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం**

దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు జలసౌధలో దేవాదుల ప్రాజెక్టుపై జరిగిన సమీక్షలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్రంగా సమీక్షించి, ఎక్కడ పనులు నిలిచిపోయాయి, అందుకు కారణాలేంటి.. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమస్య ను గుర్తించకుండా పనులు పూర్తవుతాయి అంటూ కాలయాపన చేయడం సరికాదని, ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు ఏజెన్సీలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించాలి.. కారణాన్ని విశ్లేషించాలి.. పరిష్కారాన్ని ఖరారు చేసి అమలు చేయాలి. ఫలితం వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షించాలి. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.



## జిల్లా ప్రజలకు మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలు

**వరంగల్ డిసిసి అధ్యక్షుడు అయూబ్**

వరంగల్, బ్యూరో మహా ; మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా ప్రజలకు, ముస్లిం సోదరులకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, కరుణ, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన కోరారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు.కులమత సామరస్యం, శాంతి, పరస్పర గౌరవం కోసం ప్రవక్త మహమ్మద్ అందించిన సందేశాలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అయూబ్ గారు పేర్కొన్నారు.మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు నింపాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ అయూబ్ గారు ఆకాంక్షించారు.

## ఏకగ్రీవం జరిగితే ఎమ్మెల్యే టికెట్ మరిచిపోవాల్సిందే

**జగన్ సంచలన ప్రకటన**



అమరావతి, మహా : "ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందో... నెక్స్ట్ టైమ్ ఎమ్మెల్యే టికెట్ మర్చిపోవాల్సిందే. నియోజకవర్గాల్లో కాండిడేట్లను నుంచోబెట్టి సపోర్ట్ ఇచ్చాడా.. లేదా అని రిపోర్టు తెప్పించుకుంటా." అని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు, ఇన్ ఛార్జిలకు సంచలన వార్నింగ్ ఇచ్చారు. స్థానిక ఎన్నికలను అత్యంత సీరియస్ గా తీసుకోవాలని ఆదేశించారు. చంద్రబాబు ఎన్ని అక్రమాలకు పాల్పడ్డా యుద్ధంలా పోరాడాలన్నారు.

## వనమహోత్సవం విజయవంతం

- మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత
- మండల ప్రత్యేక అధికారి శ్రీలత




**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాపకొల్లు, కొత్తూరు, జూలూరుపాడు, గ్రామ పంచాయతీల పరిధిలోని ఏవీన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి మండల పరిషత్ ప్రత్యేక అధికారి శ్రీ లత హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన మొక్కలను క్రమం తప్పకుండా పరిరక్షించి వాటిని వృక్షాలుగా పెంచాలని ఆమె సూచించారు. అదేవిధంగా అన్ని గ్రామపంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, హెల్త్ సెంటర్ లు, గ్రామపంచాయతీల పరిసరాలలో సర్పంచ్ లు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, ఏపీఓ రామారావు, టిఏ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

జూలూరుపాడు, మహా:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం జూలూరుపాడు గ్రామ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానా స్పదంగా ఉన్న ఏపీ 16 టిసి 9165 అను మెగా మాక్స్ ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో 16 ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.ఆటోను నడుపుతున్న కొమ్మినేని నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రేషన్ బియ్యంతో పాటు ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై పలు సెక్షన్ ల కింద ఏఎస్ఐ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు.



## కాలువలో పడి వ్యక్తి మృతి

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధి సీతారామ ప్రాజెక్ట్ రాజీవ్ కెనాల్ కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీస్ కథనం ప్రకారం వినోబానగర్ గ్రామానికి చెందిన బోడా నాగయ్య (45) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడినట్లు తెలిపారు. సమీపంలో ఉన్న వ్యవసాయ కూలీలు గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని, వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని నాగయ్యను నీటిలో నుంచి బయటకు తీసి, కొద్దిగా ఊపిరి ఉన్నట్లు గుర్తించి అంబులెన్స్ ద్వారా జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. నాగయ్య మృతి పై ఎటువంటి అనుమానం లేదని, వారి కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు.

## ఉవ్వెత్తున ఎగిసిన విద్యార్థి ఉద్యమం!

- కలెక్టరేట్ ను ముట్టడించిన ఏబీవీపీ
- ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా
- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏబీవీపీ సమరశంఖం




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద వేలాది మంది విద్యార్థులతో ఏబీవీపీ భారీ ఆందోళన చేపట్టింది. ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు కలెక్టరేట్‌ను ముట్టడించడంతో ప్రాంగణం మొత్తం ఆందోళన నినాదాలతో మార్మోగింది."స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి" అంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ జగదీష్ మాట్లాడుతూ... విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని తీవ్రంగా మండిపడ్డారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తల్లి దండ్రులు అప్పులు చేసి పిల్లల చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం హామీలకే పరిమితం కాకుండా వెంటనే కార్యాచరణ చేపట్టాలని జగదీష్ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో ఏబీవీపీ చూస్తూ ఊరుకోదని, రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన విద్యార్థి ఉద్యమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.కలెక్టరేట్ ముట్టడితో పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు. విద్యార్థుల ఆగ్రహాన్ని ప్రభుత్వం ఇకనైనా గుర్తించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్లకేడి సాయిచరణ్, నేషనల్ కళామంచ్ కో కన్వీనర్ మణికంఠ, విభాగ్ కన్వీనర్ ప్రదీప్, శంషాబాద్ జిల్లా కన్వీనర్ పవన్, స్టేట్ టెక్నికల్ గుణవంత్ రెడ్డి, సందీప్ మల్లేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ క్యాటరింగ్ కాంట్రాక్టుల పేరుతో హాస్టల్ యజమానులకు టోకరా

- నిందితుడి అరెస్ట్..రూ.36.99 లక్షల భారీ మోసాలు
- వెలుగులోకి -23 కేసులు, 6 సైబర్ ఫిర్యాదుల్లో నిందితుడి ప్రమేయం




**హనుమకొండ, మహా:** నకిలీ క్యాటరింగ్ కాంట్రాక్టులు, ఆహార సరఫరా అవకాశాల పేరుతో హాస్టల్ యజమానులను మోసం చేస్తున్న అంతర్ జిల్లా సైబర్ మోసగాడిని ఎట్టకేలకు హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధిగా పరిచయం చేసుకుని, కంపెనీ ఉద్యోగులకు ఆహారం సరఫరా చేసే క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్.461/2025, అండర్ సెక్షన్ 318(4) బీఎన్ ఎస్, సెక్షన్ 66డీ ఐ టి యాక్ట్ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని అరెస్ట్ చేయగా, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు మోసపూరిత కేసుల్లో అతని ప్రమేయం బయటపడింది.నిందితుడి నేర విధానంనిందితుడు హాస్టల్ బోర్డుల పై ఉన్న మొబైల్ నంబర్లను సేకరించి, వివిధ నంబర్ల ద్వారా హాస్టల్ యజమానులను సంప్రదించేవాడు. తాను ప్రముఖ కంపెనీ ఉద్యోగినని లేదా ప్రతినిధినని పరిచయం చేసుకుని, ఆ కంపెనీ ఉద్యోగులకు ఆహారం సరఫరా చేసేందుకు క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించేవాడు.అనంతరం అగ్రిమెంట్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజులు, క్యాటరింగ్ సామగ్రి కొనుగోలు, ఇతర ఖర్చుల పేరుతో బాధితుల నుంచి డబ్బులు బ్యాంకు ఖాతాలు లేదా యూపీఐ ఖాతాలకు బదిలీ చేయించు కునేవాడు. డబ్బులు అందుకున్న తర్వాత మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం లేదా నంబర్ మార్చడం ద్వారా బాధితులకు అందుబాటులో లేకుండా పోయేవాడు.

కొన్ని సందర్భాల్లో ఇతరుల యూపీఐ ఖాతాలను ఉపయోగించి, అవి కంపెనీ సిబ్బందికి సంబంధించిన ఖాతాలని తప్పుడు సమాచారం ఇచ్చి డబ్బులు బదిలీ చేయించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వసూలు చేసిన డబ్బులో కొంత మొత్తాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించడంతో పాటు, కొంత మొత్తాన్ని ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్ ఫారమ్‌లో కోల్పోయినట్లు పోలీసులు గుర్తించారు.

**పలు జిల్లాల్లో కేసులు**

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 10కేసుల్లో నిందితుడి ప్రమేయం గుర్తించబడింది. అదేవిధంగా ఖమ్మం, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో మరో 7 కేసులు వెలుగులోకి వచ్చాయి.

ఇప్పటివరకు నమోదైన కేసుల్లో మొత్తం రూ.33,33,950/ నష్టం జరిగినట్లు గుర్తించగా, రూ.12,40,657/ మొత్తాన్ని హోల్డ్ చేశారు. అదనంగా ఎఫ్ ఐ ఆర్ లు నమోదు కాకుండా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదైన మరో 6 ఫిర్యాదుల్లో రూ.3,65,050/ నష్టం జరిగినట్లు గుర్తించారు. వాటిలో రూ.68,430/హోల్డ్ చేయబడింది.

అన్ని కేసులు, సైబర్ ఫిర్యాదులను కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.36,99,000/నష్టం జరిగినట్లు గుర్తించగా, రూ.13,09,087/మొత్తాన్ని హోల్డ్ చేయడంలో పోలీసులు సఫలమయ్యారు.

**నిందితుడి వివరాలు**

మహమ్మద్ షబ్బీర్ @ కిరణ్ కుమార్ @ శ్రీకాంత్ రెడ్డి @నర్సింహారెడ్డి, వయస్సు 44 సంవత్సరాలు, సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఇతను ప్రస్తుతం హైదరాబాద్ లోని కుత్బుల్లాపూర్ రామ్‌రెడ్డి నగర్‌లో నివసిస్తున్నాడు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

నిందితుడి నుంచి 3 మొబైల్ ఫోన్లు, 3 సిమ్ కార్డులు, 2 బ్యాంకు పాస్‌బుక్స్, 1 చెక్‌బుక్, 2 ఏటీఎం కార్డులు, 1 డైరీ తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తు బృందం కేసును హన్మకొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా దర్యాప్తు చేశారు. దర్యాప్తులో ఎం కిరణ్ కుమార్, పీసీ 1229; కె. రమణకర్, పీసీ 1413; డి. రవి, హెచ్ జి701; డి. కారుణ్య, డబ్ల్యూపిసి3272; ఎండి. సల్మాన్ పాషా తదితరులు దర్యాప్తు బృందంలో కీలకంగా పనిచేశారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

క్యాటరింగ్ కాంట్రాక్టులు, ఉద్యోగ అవకాశాలు లేదా వ్యాపార అవకాశాల పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కంపెనీ పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే, సంబంధిత కంపెనీ అధికారిక ఫోన్ నంబర్లు లేదా అధికారిక వనరుల ద్వారా స్వతంత్రంగా వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలి.

అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్, అడ్వాన్స్, సామగ్రి కొనుగోలు వంటి పేర్లతో తెలియని వ్యక్తులు సూచించిన బ్యాంకు ఖాతాలు లేదా యూపీఐ లకు డబ్బులు బదిలీ చేయకూడదు. ముఖ్యంగా ఓటీపీ పిన్ నెంబర్లు, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని

ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేసి, సంబంధిత లావాదేవీల వివరాలు, మొబైల్ నంబర్లు, సందేశాలు, చెల్లింపు రసీదులు తదితర ఆధారాలను భద్రపరచుకోవాలి. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ ప్రజలకు సూచించారు.

ANN తెలుగు

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్

26-08-2026



# ఏపీఎల్ మహిళా క్రికెటోత్సాహం



## హోరాహోరీగా సాగిన వేలంలో 74 మంది క్రీడాకారిణుల కొనుగోలు

### అత్యధిక ధర దక్కించుకున్న హ్యాన్రిటా

### సెప్టెంబర్ 15 నుంచి మంగళగిరి స్టేడియంలో టీ20 టోర్నీ

### బ్రాండ్ అంబాసిడర్ గా మిథాలీరాజ్




(మహా - విజయవాడ )

మహిళా క్రికెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో మరింత ప్రోత్సాహం అందించే దిశగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మరో కీలక అడుగు వేసింది. పురుషుల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ తరహాలోనే మహిళల కోసం తొలిసారిగా ఫ్రాంచైజీ విధానంలో నిర్వహించనున్న మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ కు రంగం సిద్ధమైంది. టోర్నీలో పాల్గొనే నాలుగు జట్ల కోసం విజయవాడలో నిర్వహించిన ప్లేయర్ల వేలం ఉత్కంఠగా సాగింది. మొత్తం 74 మంది మహిళా క్రికెటర్లను ఫ్రాంచైజీలు తమ జట్లలోకి తీసుకున్నాయి.





### బ్రాండ్ అంబాసిడర్ మిథాలీరాజ్

ఈ వేలంలో ఆల్‌రౌండర్ ఫెరీరా హెన్రిటా అత్యధిక ధర పలికింది. ఆమెను గోదావరి గోల్డెన్ ఈగిల్స్ ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో రూ.4.30 లక్షలకు సొంతం చేసుకుంది. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఈ టోర్నమెంట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం లీగ్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ టీ20 టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో జరగనుంది. మొత్తంగా ఈ లీగ్, ఆంధ్రాలో మహిళా క్రికెట్ అభివృద్ధికి ఒక చారిత్రాత్మక ముందడుగుగా క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు




### నాలుగు జట్ల మధ్య పోటీ

డబ్ల్యు ఏపీఎల్ లో మొత్తం నాలుగు జట్లు బరిలోకి దిగనున్నాయి. అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్, రాయలసీమ జెన్ స్టార్స్ జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. అమరావతి జట్టుకు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, వైజాగ్ ఫైర్ బర్డ్స్‌కు ఒరా మోటార్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్‌కు ఎన్‌ఎస్‌ఆర్ ఇండస్ట్రీస్, రాయలసీమ జెన్ స్టార్స్‌కు గ్యారిసన్ కన్‌స్ట్రక్షన్స్ ఫ్రాంచైజీ హక్కులను దక్కించుకున్నాయి. మొత్తం నాలుగు ఫ్రాంచైజీలు 74 మంది మహిళా క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి. రాయలసీమ జెన్ స్టార్స్, అమరావతి ఈఛాంపియన్స్‌తో పాటు వైజాగ్ ఫైర్ బర్డ్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్ జట్లు తమకు కేటాయించిన రూ.15 లక్షల పర్స్‌తో బలమైన జట్లను నిర్మించుకున్నాయి.

### ఆంధ్రా క్రికెట్‌లో ఓ కొత్త శకం

ఆంధ్రా క్రికెట్‌లో ఓ కొత్త శకం మొదలైందనడానికి నిదర్శనంగా నిలిచింది 12 ఏళ్ల షణ్ముఖ ప్రియ. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ కోసం జరిగిన వేలంలో ఈ చిన్నారిని రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు కొనుగోలు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతి పిన్న వయస్కురాలిగా నిలిచిన షణ్ముఖ ప్రియ, ఈ లీగ్ యువ ప్రతిభను ప్రోత్సహించడానికి ఎంతగా కట్టుబడి ఉందో చెప్పకనే చెబుతోంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారిణులను వెలుగులోకి తీసుకురావాలన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ లక్ష్యానికి ఈ ఎంపిక అద్దం పడుతోంది. విజయవాడలో జరిగిన ఈ ప్లేయర్ల వేలం ఆద్యంతం



### రాయలసీమ జెన్ స్టార్స్ లో శ్రీచరణి

రాయలసీమ జెన్ స్టార్స్ నల్లపురెడ్డి శ్రీచరణిని వేలంలో దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ప్రముఖ భారతీయ అంతర్జాతీయ మహిళా క్రికెట్ క్రీడాకారిణి. ఆమె ఎడమచేతి వాటం స్పిన్నర్. ప్రపంచకప్ లో సత్తాచాటిన శ్రీచరణిని రాయలసీమ జట్టు దక్కించుకోవడం విశేషం. బ్యాటర్ల కదలికలను బట్టి బంతులు వేసే శ్రీచరణి.. వైవిధ్యంతో బోల్తా కొట్టిస్తుంది. బంతి వేగాన్ని తగ్గించడం, ఒక బంతిని స్పిన్ చేసి మరొక బంతిని నేరుగా వేయడం ద్వారా ప్రత్యర్థి బ్యాటర్లను తికమక పెట్టింది. ప్రపంచకప్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో దీప్తిశర్మ తర్వాత శ్రీచరణియే ఉంది. ఎల్లుట్ల పద్మజాను రూ.2లక్షలకు రాయలసీమ జెన్ స్టార్స్ కొనుగోలు చేసింది

### అమరావతి ఈ-ఛాంపియన్స్‌లో అనూష

ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సొంతం చేసుకున్న అమరావతి ఈఛాంపియన్స్ జట్టు వేలంలో కీలక ఆటగాళ్లను దక్కించుకుంది. బ్యాటర్ నీరగట్టు అనూషను రూ.2.10 లక్షలకు కొనుగోలు చేసింది. ఆల్‌రౌండర్ కాంద్రేగుల దేవిక కోసం రూ.2 లక్షలు వెచ్చించింది. వికెట్ కీపర్ కాట్రగడ్డ దీక్షకు రూ.1.90 లక్షలు, విశాఖకు చెందిన ఆల్‌రౌండర్ షబ్నమ్ షకీల్‌ను రూ.1.30 లక్షలకు దక్కించుకోగా, బ్యాటర్ పి.రంగలక్ష్మిని రూ.లక్షకు కొనుగోలు చేసింది. ఆల్‌రౌండర్ తరుణి జోషిని రూ.1.20 లక్షలకు దక్కించుకుంది. బ్యాటర్ కట్టా మహంతి శ్రీకి రూ.85 వేలు, ఆల్‌రౌండర్ కె.హంస, బ్యాటర్ అంకం విష్ణుప్రియకు చెరో రూ.60 వేల ధర పలికింది. ఇక హేమసాయి రమ్యను రూ.55 వేలకు, ఆల్‌రౌండర్ సాయిపూజితను రూ.50 వేలకు, బౌలర్ నక్కా సనాను రూ.45 వేలకు, ఆల్‌రౌండర్ ఓరుగంటి సాహితీశ్రీని రూ.40 వేలకు అమరావతి ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది. ఎం.రుక్సార్ తబస్సుమ్, సాయిదీప్తి, బొడ్డుపల్లి తనిష్క, టి.మల్లిక, ఎం.సహస్రరెడ్డిలను రూ.30 వేల చొప్పున కొనుగోలు చేసింది.









### రూ.4.30 లక్షలకు హెర్నిటా

వేలంలో ఆల్‌రౌండర్ ఫెరీరా హెర్నిటా ఫ్లవియా అత్యధిక ధర పలికిన క్రికెటర్‌గా నిలిచింది. ఆమెను గోదావరి గోల్డెన్ ఈగిల్స్ ఫ్రాంచైజీ రూ.4.30 లక్షలకు కొనుగోలు చేసింది. లీగ్‌లో పాల్గొంటున్న నాలుగు ఫ్రాంచైజీలు తమకు కేటాయించిన బడ్జెట్‌లో కీలక ఆటగాళ్లను ఎంచుకున్నాయి. ఒక్కో ఫ్రాంచైజీకి ఆటగాళ్ల కొనుగోలు కోసం రూ.15 లక్షల టీమ్ పర్స్‌ను కేటాయించారు. ఒక్కో జట్టు కనీసం 18 మంది నుంచి గరిష్ఠంగా 20 మంది వరకు క్రికెటర్లను తీసుకునే అవకాశం కల్పించారు. ఈ విధానంతో యువ ప్రతిభతో పాటు అనుభవజ్ఞులైన క్రికెటర్లకు కూడా లీగ్‌లో అవకాశాలు దక్కనున్నాయి.





# హాస్టల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎంపీడీవో

**వలిగొండ ఆగస్టు 25 మహా న్యూస్ :** వలిగొండ మండలంలోని లోతుకుంట లో బాలికల హాస్టల్ ను వారి సమస్యలను అడిగి తెలుసుకున్న వలిగొండ ఎండిఓ జలంధర్ రెడ్డి మంగళవారం వివిధ గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు ఈ కార్యక్రమంలో లోతుకుంట సర్పంచ్ రాములు ఏపీవో పరశురాములు ఏఈ హౌసింగ్ అశోక్ గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# రేషన్ కార్డుల పంపిణీ

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 25 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పెద్దపేట వేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులుఅధికారులు తదితరులు పాల్గొన్నారు



# ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**సిఐ రవి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**

**వలిగొండ , మహా న్యూస్ :** మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో హిందూ ముస్లింలు పండుగలు జరుపుకోవాలని సి ఐ రవి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ అన్నారు నేడు జరగనున్న మిలాద్ ఉన్ నబి పండుగను ముస్లింలు శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ సమావేశంలో హిందూ ముస్లింమత పెద్దలు పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

- సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం..
- విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి
- మణుగూరు పట్టణ సీఐ పాటి నాగబాబు

**మణుగూరు, మహా :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మణుగూరు పట్టణ సీఐ పాటి నాగబాబు సూచించారు. మణుగూరులోని సిద్దార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్, సైబర్ మోసాలు, క్రమశిక్షణ, భవిష్యత్తు ప్రణాళికలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ పాటి నాగబాబు, ఎస్ఐ రావూఫ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ పాటి నాగబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యంతో పాటు చదువు, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ మోసాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఎస్ఐ రావూఫ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, జీవితంలో సాధించాల్సిన లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా, సైబర్ మోసాలకు గురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ భద్రత, క్రమశిక్షణ, భవిష్యత్తుపై బాధ్యతాయుతమైన ఆలోచన పెంపొందించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ పాటి నాగబాబు, ఎస్ఐ రావూఫ్, ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు

- ప్రతి రోజు చెత్త సేకరణ పై ప్రత్యేక దృష్టి సారించాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న



**వరంగల్, కార్పొరేషన్ మహా :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో ఆకస్మికంగా పర్యటించి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. మోడల్ డివిజన్ గా ఎంపిక చేసిన 13వ డివిజన్ శ్రీనివాస కాలనీ, నవయుగ కాలనీలలో పర్యటించిన కమిషనర్ ఇంటింటి చెత్త సేకరణ, తడి-పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గృహిణులు, ప్రజలతో నేరుగా మాట్లాడి చెత్త సేకరణ ఆటో ప్రతిరోజూ వస్తుందా, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అదే కాలనీలో నిర్మాణ వ్యర్థాలను డ్రైనేజీలో పడవేసిన విషయం కమిషనర్ దృష్టికి రావడంతో, సంబంధిత వ్యక్తులను గుర్తించి నిబంధనల మేరకు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు అనంతరం చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, నిమజ్జనానికి ముందే ప్రాంతంలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయి ఉంటే వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాత కరవాణి ప్రాంతం మొత్తం పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి రంగసాయిపేట డిగ్రీ కళాశాలను సందర్శించిన కమిషనర్, వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొననున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, ఇతర అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పరిశీలించారు. ఈ పర్యటనలో సానిటరీ సూపర్‌వైజర్ గోపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రీదేవి అంతర్ మందిర దర్శనము

**దమ్మపేట ,మహా :** మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ గాయత్రి మాతా ఆశ్రమంలో ఈ నెల 27వ తేదీ గురువారం శ్రీ గాయత్రీ మాతా అంతర్ మందిరదర్శనము ఉంటుందని ఆశ్రమ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రేమ్ సుస్థిర మూర్తీజీ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల లోనే కాకుండా మరెక్కడా లేని విధంగా ప్రతిష్టించబడిన శ్రీ గాయత్రీ మాతా ఆలయంలోకి అంతర్ మందిర దర్శనం ఏర్పాటు చేయడం చాలా విశిష్టతను సంతరించుకున్నదని ఆయన తెలిపారు. గర్భాలయంలోకి ప్రవేశం కొరకు సాధారణ భక్తులను అనుమతించడం దీని ప్రధాన ఉద్దేశ్యం గా స్వామిజీ పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 6గంటలనుండే దర్శనం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని ,అందుకు పురుషులు తప్పనిసరిగా లుంగీ , టవల్ ధరించాలని ,మహిళలు సాంప్రదాయ దుస్తులతో ఆలయానికి రావాలని కోరారు. చిన్నపిల్లలు సైతం పట్టు పరికిణీ దుస్తులు ధరించి రావాలని కోరారు. దీని వలన సర్వ అరిష్టాలు తొలిగిపోయి లోక కళ్యాణార్థం సుఖ సంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసనీయత కలిగి ఉంటారని మూర్తీజీ అభిప్రాయం వ్యక్తం చేశారు.



# మొక్కలు నాటండి సంరక్షించండి పర్యావరణాన్ని కాపాడండి

- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- జిల్లా కలెక్టర్ తో కలిసి మొక్కలు నాటిన మంత్రి

**ఖిలా వరంగల్, మహా :** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం ఖిలా వరంగల్ పరిధిలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో వనమహోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి ప్రకృతి సమతుల్యాన్ని కాపాడాలని పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో భాగస్వాములు కావాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు.వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను కాపాడాల్సిన అవసరాన్ని తెలుపుతూ నిర్వహించిన ప్రదర్శనలను మంత్రి సురేఖ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాశిబుగ్గ సర్కిల్ ఆఫీస్ లో ఇంటి నంబర్ల భాగోతం

- డిప్యూటీ కమిషనర్ తీరుపై బాధితుడి ఆగ్రహం, కమిషనర్ కు ఫిర్యాదు
- తప్పుడు సర్వే నంబర్ చూపి 9 ఏళ్ల ఇంటి నంబర్ రద్దు
- ఏడీ సర్వేలో 624 అని తేలినా పట్టించుకోని వైనం
- ఇంటి నెంబర్ ను పునరుద్ధరించాలని బాధితుడి వినతి



**వరంగల్, కార్పొరేషన్ మహా :** నిబంధనలను నియమాలు ఇవేమీ పట్టించుకోకుండా లంచాలు తీసుకొని ఖచ్చితమైన సర్వే నెంబర్లు ఏమి చూడకుండా దేనికైనా ఇంటి నెంబర్, అనుమతులు ఇస్తారా అంటూ ఓ బాధితుడు తనకు జరిగిన అన్యాయం పై బల్దియా పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పై ఆరోపణలు చేస్తూ బల్దియా ఆవరణలో మీడియా ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపులో అక్రమం జరిగిందంటూ ఓ బాధితుడు గ్రీవెన్స్ లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. కరీమాబాద్ కు చెందిన శీక్ష కుమారస్వామి తన ఇంటి నంబర్ 185241గా ఫిర్యాదులో పేర్కొన్నారు.

**వివరాల్లోకి వెళితే..**

సర్వే నం.527లో భూమి, ఇల్లు లేకపోయినా రామస్వామి వెంకటరెడ్డి అనే వ్యక్తి తన సర్వే నం. 624 లోని భూమిని, ఇంటిని 527గా తప్పుగా చూపి తనకు 9 ఏళ్లుగా ఉన్న ఇంటి నంబర్లను అడిషనల్ కమిషనర్ ద్వారా రద్దు చేయించారని బాధితుడు ఆరోపించారు.నా ఇంటి నంబర్ 4751395/1/5, మంజుల ఇంటి నంబర్ 4751395/1/4, పెంచాల రాజు ఇంటి నంబర్ 4751395/1/3 కాగా, 9 ఏళ్లుగా పన్ను కడుతున్నామని, మేము రిజిస్ట్రేషన్ చేసుకోకముందే ఇక్కడ ఇంటి నంబర్ ఉందని పేర్కొన్నారు. ఏడీ సర్వే నివేదికలో కూడా మా భూమి 624లో ఉన్నట్లు స్పష్టంగా తేలిందన్నారు. ఇవేమీ పరిశీలించకుండా రద్దు చేసినట్లు తెలిపారు. ఇంతకు ముందు కమిషనర్ ఆ వ్యక్తికి ఇచ్చిన నంబర్ ను Roc. No.C.No.1/E119307/2021 ద్వారా రద్దు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.వెంటనే సర్వే నం. 624ను ప్రత్యక్షంగా పరిశీలించి, ఏడీ సర్వే రిపోర్టును పరిగణనలోకి తీసుకుని, తన ఇంటి నంబర్లను పునరుద్ధరించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు. మా ఇంటి నెంబర్ ను అక్రమంగా రద్దు చేసిన అధికారుల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కుమారస్వామి కమిషనర్ ను కోరారు.అయితే బల్దియా లో ఇలాంటి సంఘటనలు అధికారుల నుంచి రెవెన్యూ ఉద్యోగులు సిబ్బందికి ఇవేమీ కొత్తేమి కాదు గతంలో కూడా జరిగిన ఇలాంటి సంఘటనలు చాలానే ఉన్నాయి. ఉదాహరణకు హంటర్ రోడ్డు లోని ఓ స్థలం విషయంలో కూడా ఇదే జరిగిందని ఓ రిటైర్ ఎంప్లాయ్ దంపతులు ఎన్నో ఏళ్లుగా ఉన్నటువంటి ఇంటి నెంబర్ గల స్థలాన్ని 2022 లో విక్రయించారు. కాగా అదే స్థలాన్ని తక్కువ ధరలో అప్పటి మాజీ మేయర్ కుమారుడు తీసుకోగా ఆ స్థలం పై గతంలో ఉన్న పాత ఇంటి నెంబర్ ను కొన్న వారికే తెలియకుండా పదవిని అధికారం అడ్డుపెట్టుకొని ఆ ఇంటి నెంబర్ ను రికార్డుల్లో నుంచి పూర్తిగా తొలగించి వారిని ఆ స్థలం వైపు కూడా రాకుండా వారి పై కేసులు కూడా పెట్టించారని 2023లో ఓ ప్రముఖ పత్రికలో కూడా ఈ అంశం ప్రచురితమైంది. ఇలా ఎందరో బాధితులు సంబంధిత అధికారులు సిబ్బంది చేసిన తప్పిదాల వల్ల బల్దియా చుట్టూ న్యాయం కోసం తిరుగుతూ ఉండగా కొంతమంది తిరిగి తిరిగి విసిగి వేసారి పోయిన వారు కూడా ఉన్నారని తెలుస్తోంది.

# ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి?

- కొండ సురేఖ వ్యవహారంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు....?
- దేవాదాయ శాఖ బాధ్యతలు అప్పగించే అవకాశంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ....!



వేములవాడ,మహా తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి కేబినెట్ మార్పుల అంశం హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి కొండ సురేఖ చుట్టూ కొనసాగుతున్న వివాదాలు, తాజాగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గంలో మార్పులు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం ఊపందుకుంది. ఇదే జరిగితే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

**- మార్పుల వేళ తెరపైకి కొత్త పేరు...**

కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంతకాలంగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా కొండ సురేఖ వ్యవహారం ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. పార్టీలో నెలకొన్న అసంతృప్తిని చక్కదిద్దడంతో పాటు సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని కేబినెట్ లో మార్పులు చేయవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలోనే ఆది శ్రీనివాస్ పేరు ప్రాధాన్యత సంతరించుకుంది. వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**- బీసీ సమీకరణాల్లో కీలకంగా..**

కాంగ్రెస్ రాజకీయ సమీకరణాల్లో బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యత పెంచే క్రమంలో ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి కల్పించాలనే ఆలోచన ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన నాయకుడిగా ఆయనకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉండటం కూడా అనుకూల అంశంగా భావిస్తున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణలో పార్టీకి బలమైన నాయకత్వాన్ని మరింత విస్తరించాలనే ఆలోచనలో భాగంగా ఆది శ్రీనివాస్‌ను కేబినెట్ లోకి తీసుకోవడం ద్వారా రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని కొందరు కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.

**సౌమ్య నేతగా ప్రత్యేక గుర్తింపు**

ఆది శ్రీనివాస్ రాజకీయ ప్రస్థానం సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. పార్టీ పట్ల విధేయతతో పాటు నియోజకవర్గ ప్రజలతో సన్నిహితంగా ఉండే నాయకుడిగా ఆయనకు పేరు ఉంది. ప్రత్యర్థి పార్టీల నేతలతోనూ వ్యక్తిగత సంబంధాలు కొనసాగిస్తూ వివాదాలకు దూరంగా ఉండే ఆయన శైలి ప్రత్యేకంగా చర్చకు వస్తోంది.అనేక రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రస్తుత స్థాయికి చేరుకున్న ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కితే.. మున్నూరు కాపు సామాజికవర్గం నుంచి రాష్ట్ర కేబినెట్ లో ప్రాతినిధ్యం లభించినట్లవుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

**దేవాదాయ శాఖపైనే ఆసక్తి....?**

కొండ సురేఖను కేబినెట్ నుంచి తప్పిస్తే.. ఆమె నిర్వహిస్తున్న శాఖల్లో ఏదైనా ఆది శ్రీనివాస్‌కు అప్పగించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా దేవాదాయ శాఖ బాధ్యతలు ఆయనకు అప్పగించవచ్చనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.అయితే శాఖల మార్పు, కేబినెట్ విస్తరణ వంటి అంశాలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఖరారైందని చెప్పే పరిస్థితి లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**అధిష్టానం నిర్ణయంపైనే ఉత్కంఠ**

కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగితే ఎవరికి అవకాశం దక్కుతుంది? ఎవరిని తప్పిస్తారు? కొత్తగా ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారు? అన్న అంశాలపై కాంగ్రెస్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామాల మధ్య ఆది శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటంతో వేములవాడ రాజకీయాల్లోనూ ఆసక్తి పెరిగింది. మంత్రి పదవి విషయంలో సాగుతున్న ఈ ప్రచారానికి త్వరలో అధిష్టానం నిర్ణయంతో తెర పడుతుందా? లేక ప్రస్తుతానికి చర్చలకే పరిమితమవుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.....!

# న్యాయవాది ని సత్కరించిన బార్ సభ్యులు

**దమ్మపేట ,మహా :** మండల కేంద్రానికి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరుకు అవిరాళ కృషి చేసిన సత్తుపల్లి మాజీ బార్ అసోసియేషన్ ప్రశిడెంట్ మందడపు రాజేంద్రప్రసాద్ ను మంగళవారం దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. బార్ అద్యక్షులు గొంది మురళీమోహన్ ఆధ్వర్యంలో జడ్జి భవాని చేత ఆయనకు పుష్పగుచ్చం అందజేసి ,శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు న్యాయసేవలు అందించాలని ,అశ్వారావుపేట ,దమ్మపేట ,ములకలపల్లి ,చంద్రుగుండ తదితర ప్రాంత రైతులకు న్యాయస్థానం అందుబాటులో కి రావాలని సీనియర్ న్యాయవాది రాజేంద్రప్రసాద్ కృషి చేశారని తెలిపారు. ఆనాటి ప్రభుత్వ ప్రతినిధులతో అనేక మార్లు కష్ట నష్టాల కోర్చి కోర్టును మంజూరు చేయించడంలో అవిశ్రాంతంగా కృషి చేయడం అభినందించదగిన విషయంగా భావించి ,ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ సభ్యులు పాల్గొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM

బుధవారం, హైదరాబాద్ | 26-08-2026
ANN తెలుగు



## మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం

- మొక్కలు నాటుదాం.. నగరాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దుదాం
- మొక్కలు నాటిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

**వరంగల్, పోచమ్మ మైదాన్;** నగరం పచ్చదనంగా ఉండాలన్న, మానవాళి మనుగడ కోనసాగలన్నా మనందరం మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడిన వారము అవుతామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న అన్నారు.వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ నగరంలోని తోట మైదానంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమంలోజీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,మొక్కలు నాటుదాం.. వరంగల్ ను పచ్చని నగరంగా తీర్చిదిద్దుదామని అన్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి వృక్షాలుగా ఎదిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ముఖ్యంగా నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో అనువైన మొక్కలను నాటడం తో పాటు వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు..ప్రజలు కూడా ఈ వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగస్వాములై తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, సిహెచ్ ఓ లక్ష్మారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్ట్

- 251 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం,నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం
- దామెర పోలీసులను అభినందించిన వరంగల్ సీపీ




**వరంగల్, క్రైమ్ మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతనూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా, వారి బంగారు భవిష్యత్తును కాపాడటంతో పాటు, గంజాయి తో పాటు ఇతర మత్తు పదార్థాలను విక్రయాలకు పాల్పడే వారిని నియంత్రించి గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్‌కుమార్ నేతృత్వంలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళ్తే..ముదిగొండ నాగేశ్వర్ రావు, వయస్సు 55, పులుకుర్తి గ్రామం, దామెర మండలం, హన్మకొండ జిల్లా. ఇతను సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితుడు తనకు వున్న నెట్ వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్‌తో పాటు సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాధమిక విచారణలో వెల్లడైంది.పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. మత్తు పదార్థాల అక్రమ రవాణా తో పాటు వినియోగం పై తెలంగాణ పోలీస్ విభాగం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవడంతో పాటు, విక్రయదారుల పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాము. మత్తు పదార్థాల కట్టిడికై ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రధానంగా ఎవరైన గంజాయి విక్రయాలకు పాల్పడిన, వినియోగించిన స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. గంజాయి స్మగ్లర్ ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్.ఐ వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతి తో పాటు ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుల్ ను మన స్ఫూర్తిగా అభినందించారు.



## పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ

**పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్**

**పాలకుర్తి, మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పాలకుర్తి వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 27న ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాలకుర్తి రైతు వేదికలో నిర్వహించనున్నారు. పుట్టగొడుగుల పెంపకం విధానం, అనుకూల వాతావరణ పరిస్థితులు, సబ్‌స్ట్రేట్ మరియు స్పాన్ తయారీ, వివిధ రకాల పుట్టగొడుగుల సాగు, సంరక్షణ, మార్కెటింగ్ తదితర అంశాలపై నిపుణులు ప్రత్యక్ష ఆచరణాత్మక శిక్షణ అందించనున్నారు. పుట్టగొడుగుల పెంపకం ద్వారా స్వయం ఉపాధి, అదనపు ఆదాయ అవకాశాలపై కూడా అవగాహన కల్పించనున్నారు.ఈ శిక్షణకు ముందుగా నమోదు చేసుకున్న 25 మంది రైతులకు మాత్రమే అవకాశం కల్పించనున్నారు. మహిళా రైతులు, నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వయం ఉపాధి కోరుకునే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రం అందజేయనున్నారు.
ఆసక్తి ఉన్న రైతులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవడానికి సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ లేదా పాలకుర్తి రైతు వేదికను సంప్రదించాలని అధికారులు సూచించారు. సీట్లు పరిమితంగా ఉన్నందున ముందస్తు నమోదు తప్పనిసరి అని, శిక్షణ పూర్తిగా ఉచితమని తెలిపారు.



## కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

- రూ.1.19 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని
- అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం

**హనుమకొండ, మహా ;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 4వ డివిజన్ పరిధిలోని జ్యోతిబాస్ నగర్, పెద్దమ్మగడ్డ, అక్షర కాలనీ తదితర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం సుమారు రూ.1.19 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ 4వ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చేపట్టిన పనులకు కాలపరిమితిని నిర్దేశించి నెల రోజుల్లోగా పనులను పూర్తి చేసే విధంగా అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు.జ్యోతిబాస్ నగర్ కాలనీలో ఇప్పటికే ప్రధాన రహదారులు అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, మిగిలి ఉన్న మరో రెండు చిన్న గల్లీల్లో కూడా ఈ నెలలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వ్యవస్థ తదితర అంశాల్లో ఎక్కడా సమస్యలు లేకుండా సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలుకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, పెన్షన్లు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. పేదలు, స్లమ్ ప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నాయిని పిలుపునిచ్చారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కాలనీ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీని దశలవారీగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత నాయకులు హనుమకొండ రాజేందర్, డివిజన్ బ్లాక్ అధ్యక్షులు హనుమకొండ అంబేద్కర్ రాజు, నాయకులు బాషాబోయిన కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బొద డిన్న, అధికారులు,నాయకులు , కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జిహెచ్‌ఎంసి పరిధిలో ఘనంగా వన మహోత్సవం

**మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆర్బీ నగర్ లో వన మహోత్సవం కార్యక్రమంలో శంషాబాద్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం పలు మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటం మనందరి బాధ్యత, నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు హరితహారం, వన మహోత్సవం లాంటి కార్యక్రమాలు మానవాళి మనుగడకుఎంతో అవసరమన్నారు.ఈ కార్యక్రమంలోఅధికారులు, పార్టీ నాయకులు గణేష్‌గుప్తా, మహేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, దవణాకర్ గౌడ్ అయిల్ కుమార్, బుచ్చిరెడ్డి, ప్రభాకర్, యాదగిరి రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, టిడిపి జంగయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కల పెంపకంతో మానవాళికి ఎంతో మేలు

**చైర్పర్సన్ సోనియా దర్శన్**

**మొయినాబాద్ మహా:** మున్సిపాలిటీ పరిధిలోని వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు పెంచడం వల్ల మానవాళికి ఎంతో మేలు అని మొయినాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ అన్నారు. మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు ఈ సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ సోనియా దర్శన్ మాట్లాడుతూ ఇంటింటికి మొక్కలు నాటే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని రోడ్లు ఇరువైపులా మొక్కలు నాటడం వల్ల చెట్లుగా మారి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు, చెట్లు నాటడమే కాకుండా నాటిన చెట్లను కాపాడే బాధ్యత ప్రతి ఒకరిపైనా ఉందని తెలిపారు, మొక్కలు నాటడం వల్ల పర్యావరణం స్వచ్ఛంగా ఉంటుందని కాలుష్యం తగ్గుతుందని అన్నారు ఇప్పుడు నాటుతున్న మొక్కలు రేపటి తరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గరుగు రాజు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ స్థానిక కౌన్సిలర్లు సదువు శ్రీలత రాంచందర్, కళ్ళెంల జగపతి, గౌర అనసూయ నరసింహ, గునుగుర్తి శిరీష కిరణ్, ప్రియాంక రమేష్, ఈఈ శుక్రతా రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ

- పాల్గొన్న కాంగ్రెస్ నేత అనిల్ కుమార్

**కుషాయిగూడ, .మహా :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలహార బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఓల్డ్ మల్లాపూర్‌లో శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్.వి. శేషి నేతృత్వంలో పలహార బండి కార్యక్రమం నిర్వహించారు. అన్నపూర్ణ కాలనీలో మాతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్య నేతృత్వంలో, ఎస్.వి. నగర్ కాలనీలో ఎఫ్‌వైఏ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయితేజ నేతృత్వంలో పలహార బండి కార్యక్రమాలు నిర్వహించారు. ఓల్డ్ మల్లాపూర్ బీరప్పగడ్డ యాదవ్ వీధిలో సాయి యాదవ్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు నిర్వహించారు.కార్యక్రమాల్లో ఆయా సంఘాల సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఘనంగా ఓనం వేడుకలు

మొయినాబాద్ మహా: మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య (డీమ్డ్ టు బి) యూనివర్సిటీలో ఓనం పండుగ వేడుకలను ఘనంగా ఉత్సాహభరితమైన వాతావరణంలో నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైవిధ్యంలో ఏకత్వం, మానవతా విలువలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకల్లో యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు, పూలతో అలంకరించిన పూకలం, సాంస్కృతిక కార్యక్రమాలతో యూనివర్సిటీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా యూనివర్సిటీ చైర్మన్ & వ్యవస్థాపకులు డాక్టర్ సిహెచ్. వి. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఓనం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు.. ఐక్యత సోదరభావం సమానత్వం ఆనందం సుఖసంతోషలు మానవతా విలువలకు ప్రతీక అని అన్నారు మహాబలి చక్రవర్తి పాలనను స్మరించుకుంటూ జరుపుకునే ఓనం పండుగ సమాజంలో ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం, ప్రేమాభిమానాలతో కలిసి జీవించడం, పరస్పరం సహకరించుకోవడం, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడం వంటి గొప్ప సందేశాలను అందిస్తుందని తెలిపారు. భారతదేశం అనేక భాషలు ప్రాంతాలు సంస్కృతులు సంప్రదాయాలతో కూడిన దేశమని ఇలాంటి పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు పండుగల అంతర్లీన సందేశాలను అర్థంీసుకుని వాటిలోని మానవతా విలువలను తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు.ప్రోఛాన్సలర్ డాక్టర్ నాగ సురేష్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఓనం వేడుకలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక గా నిలుస్తాయని అన్నారు. వివిధ ప్రాంతాలు భాషలు సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలిసి పండుగను జరుపుకోవడం యూనివర్సిటీలోని ఐక్యతా భావానికి నిదర్శనమని తెలిపారు. విద్యార్థులు ఇతరుల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ స్నేహభావం సహనం పరస్పర గౌరవం సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.యూనివర్సిటీ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి మాట్లాడుతూ ఓనం స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలి. మనసులో ప్రేమను, మాటల్లో దయను చేతల్లో సేవా భావాన్ని సమాజం పట్ల బాధ్యతను కలిగి ఉండాలి అని అన్నారు. పండుగలు కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా మన సంస్కృతి సంప్రదాయాలు విలువలను తరువాతి తరాలకు పరిచయం చేసే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు వారిలో ఐక్యత నాయకత్వ లక్షణాలు సృజనాత్మకత సామాజిక స్పృహను పెంపొందించేందుకు యూనివర్సిటీలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు విలువలు, సంస్కృతి, సామాజిక బాధ్యతను అలవర్చుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఓనం వేడుకల్లో భాగంగా విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పుష్పాలతో పూకలం ఏర్పాటు చేసి, సాంప్రదాయ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. విద్యార్థుల ఉత్సాహం, సంప్రదాయ దుస్తులు, పూల అలంకరణలు యూనివర్సిటీ ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి.అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ కలిసి వేడుకల్లో పాల్గొని సేవాభావం సోదరభావం ఐక్యతను చాటుకున్నారు. ఓనం వేడుకల ద్వారా యూనివర్సిటీలోని భిన్న ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందిన విద్యార్థులంతా ఒక కుటుంబంలా కలిసిమెలిసి వేడుకలు జరుపుకోవడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. శంకర్ లింగం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. రవీందర్, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ సిహెచ్. ప్రత్యూష రెడ్డి డీన్ నర్సింగ్ సి. సునీత, నర్సింగ్ సిబ్బంది, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి

- ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కర్నె సురేందర్.

**కుషాయిగూడ, మహా :** విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కర్నే సురేందర్ డిమాండ్ చేశారు. జవహర్ నగర్ లో సిపిఎం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యా సదస్సు కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి శివన్నారాయణ హాజరై మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన జిల్లా విద్యా సదస్సును పుచ్చలపల్లి సుందరయ్య ఫంక్షన్ హాల్ ప్రగతి నగర్ బాచుపల్లి లో జరగనుందని ఈ సదస్సుకు మేధావులు ఉద్యోగులు రాజకీయ నాయకులు కవులు కార్మికులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కర్నే సురేందర్ మాట్లాడుతూ విద్యకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలలకు కళాశాలలకు అవసరమైన భవనాలు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను లెక్చరర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రైవేట్ పాఠశాలలో ఫీజులను నియంత్రించాలని ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్షావలి, నగేష్, సంధ్య, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీ. కాలేశా, జావేద్ తదితరులు పాల్గొన్నారు

## రాహుల్ కుటుంబానికి తక్షణం న్యాయం జరిగేలా ప్రయత్నిస్తా

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

కుషాయిగూడ, మహా : దివ్యాంగుడైన రాహుల్ కుటుంబానికి తక్షణం న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగుడైన రాహుల్ కు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరుకి కృషి చేస్తానని, రాహుల్ కుటుంబానికి తక్షణం న్యాయం జరిగేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు. సింహాద్రి నగర్ చంద్రగిరి కాలనీకి చెందిన 21 ఏళ్ల దివ్యాంగుడు రాహుల్ పుట్టినప్పటి నుండి అంగవైకల్యంతో బాధపడుతూ వీల్ చైర్ కే పరిమితమై ఉండగా తన కుమారుడి వైద్యం కోసం ఎన్నో సంవత్సరాలుగా తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు ఆర్థిక ఇబ్బందులు గూర్చి స్పందించిన తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ మల్కాజ్గిరి బిఆర్ఎస్ సీనియర్ మహిళ నాయకురాలు లక్ష్మి ఆనంద్ చొరవతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాహుల్ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను అర్థం చేసుకున్నానని మానవతా దృక్పథంతో రాహుల్ కు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసే విషయమై కలెక్టర్ తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని తెలిపారు. అలాగే రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో తక్షణమే రిక్వెస్ట్ లెటర్ ను అందజేసి కలెక్టర్ కు ఫోన్ చేసి రాహుల్ గురించి వివరించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించాలని తెలిపారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులు పేదలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచిన వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ముందుండి పనిచేస్తున్నారని రాహుల్ వంటి దివ్యాంగుడికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే అతని కుటుంబానికి ఎంతో ఊరట లభిస్తుంది అన్నారు. రాహుల్ కు ప్రభుత్వం అండగా నిలవాలని వీల్ చైర్ కే పరిమితమైన రాహుల్ అతని కుటుంబ పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకొని మానవతా దృక్పథంతో వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని మెరుగు శివకృష్ణ కోరారు. దివ్యాంగులకు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా గౌరవంగా జీవించేందుకు అవసరమైన నివాస వసతిని కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఉద్యమకారులు నర్సింగ్, వెంకన్న, రామ్ యాదవ్, పాత్రికేయులు చింతల విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



## తాజుద్దీన్ కు నివాళ్లు ఆర్పించిన బీఆర్ఎస్ గౌసుద్దీన్

**కారేపల్లి, మహా:** బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ గుండెపోటుతో మృతి చెందటంతో ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ నివాళ్లు ఆర్పించారు. ఈ సందర్భంగా గౌసుద్దీన్ మాట్లాడుతూ మహమ్మద్ తాజుద్దీన్ మరణం చాలా బాధాకరమని, బీఆర్ఎస్ బలోపేతానికి విశేష కృషి చేశారని తెలిపారు. తాజుద్దీన్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి చేశారు.

## యూరియా యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా అందించాలి

**రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా**




**సత్తుపల్లి,ఆగస్టు 25: మహా :** యూరియా కొరతను నివారించడంతో పాటు యూరియా పంపిణీలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గంగారం ప్రాథమిక సహకార సొసైటీ వద్ద ధర్నా నిర్వహించి, రైతులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం యూరియా కోసం అమలు చేస్తున్న యాప్ విధానంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాప్‌లో నమోదు, సాంకేతిక సమస్యలు, సర్వర్ సమస్యల కారణంగా రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యూరియా యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో మాదిరిగానే రైతులకు అవసరమైన మేరకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రతి రైతుకు యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రైతులకు న్యాయమైన ధరకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని అన్నారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి యూరియా కొరతను నివారించాలని, యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని సీపీఎం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, గుంట్రూ జయరాజు, పటాన్ తనిషా, బెజవాడ లక్ష్మీనారాయణ, బండారు వెంకటేశ్వరరావు, వేమాల బ్రహ్మారావు, గుండి సింగరాజు, వసంతరావు, ఈర్ల శ్రీను, చీపు సత్యనారాయణ, పాకనాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## బసంతనగర్ గ్రామంలో ఉత్సాహంగా వనమహోత్సవం

- **మొక్కలు నాటిన సర్పంచ్ పరిశవేణి శ్రీనివాస్ యాదవ్**

**బసంతనగర్ , మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం బసంతనగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ఈ రోజు గ్రామ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పరిశవేణి శ్రీనివాస్ యాదవ్ మరియు ఉప సర్పంచ్ అట్ల మౌనిక శ్రీనివాస్ లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించడం, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యత అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, తోటి పాలకవర్గ సభ్యులు, వి.ఓ. అధ్యక్షురాలు, కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ మొక్కలు నాటి సంరక్షించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## జిన్నింగ్ మిల్లును సందర్శించిన మార్కెటింగ్ అధికారి

**మొక్కజొన్న కొనుగోలుదారుడి నుండి ఫీజు వసూలుకు ఆదేశం**

కారేపల్లి, మహా : కారేపల్లి లోని లక్ష్మి ప్రియ కొటెక్ జిన్నింగ్ మిల్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం మంగళవారం సందర్శించారు. పత్తి సీజన్ వస్తున్న క్రమంలో సీసీఐ కొనుగోలు కేంద్రానికి జిన్నింగ్ మిల్లు ను సిద్ధం చేయటానికి మిల్లు యాజమాన్యానికి సూచనలు ఇచ్చారు. జిన్నింగ్ మిల్లు యంత్రాలను పత్తి జిన్నింగ్ చేయటానికి అనువుగా మరమ్మత్తులు చేయించుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లు యాజమాన్యం మారిన క్రమంలో కొత్త యాజమాన్యం కు ఓనర్ షిప్ మార్పిడి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిన్నింగ్ మిల్లులో మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాల నిల్వ చేసారు. ఆ మొక్కజొన్నను ప్రభుత్వం టెండర్ ద్వారా అమ్మటంతో టెండర్ దారుడు మొక్కజొన్న బస్తాలను లారీ ద్వారా తరలిస్తున్నాడు. తరలిస్తున్న మొక్కజొన్న పంటపై మార్కెట్ ఫీజు వసూలు చేయాలని స్థానిక మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. డీఎంవో వెంట సూపర్ వైజర్ ఎన్.శ్రీనివాసరావు, సీహెచ్. లక్ష్మయ్య, ఎస్.కె. మున్నీర్ పాల్గొన్నారు.

## చర్చలు విఫలమైతే సమ్మె తప్పదు..

- **కార్మికుల డిమాండ్లపై యాజమాన్యం స్పందించాలి..**
- **ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రామ్‌గోపాల్..**
- **కొండాపురం భూగర్భగనిలో ఏఐటీయూసీలో భారీ చేరికలు**



**మణుగూరు, మహా :** సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంపై ఈ నెల 27న లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగే చర్చలు విఫలమైతే సమ్మెకు వెళ్లక తప్పదని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రామ్‌గోపాల్ స్పష్టం చేశారు. సమ్మెకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు సంబంధించిన 31 ప్రధాన డిమాండ్లతో యాజమాన్యానికి ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను, సొంతింటి పథకం, మెడికల్ ఇన్వాలిడేషన్‌తో పాటు పలు కీలక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమ్మె నోటీసుపై ఇప్పటికే పలుమార్లు చర్చలు వాయిదా పడ్డాయని, ఈ నెల 27న జరిగే చర్చల్లోనైనా యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. డిమాండ్ల పరిష్కారానికి ముందుకు రాకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెకు వెళ్తామని, అందుకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40 శాతం లాభాల వాటా ప్రకటించాలని రామ్‌గోపాల్ డిమాండ్ చేశారు. మణుగూరు ఏరియాలో సేవ్ మణుగూరు నినాదంతో ఏఐటీయూసీ చేపట్టిన వరుస పోరాటాల ఫలితంగానే పీకేఓసీ డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందన్నారు. ఇది కార్మికుల విజయమని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని 'సేవ్ మణుగూరు' ఉద్యమం రుజువు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గుగని కార్మికులకు 12వ వేతన ఒప్పందం జూలై ఒకటి నుంచి అమలు కావాల్సి ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం ఇప్పటివరకు స్పందించలేదని విమర్శించారు. వేతన ఒప్పందం సాధన కోసం యూనియన్ ఇచ్చే పిలుపు మేరకు కార్మికులంతా ఐక్యంగా పోరాట కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొండాపురం భూగర్భగనికి చెందిన పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. వారికి నాయకులు కండువాలు కప్పి యూనియన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన బ్రాంచ్ కార్యదర్శి వై రామ్‌గోపాల్‌ను నాయకులు, కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్ బి సురేందర్‌రావు, పిట్ సెక్రటరీ ఆంతోని రవికుమార్, నాగేశ్వరరావు, గౌతమ్, ప్రవీణ్, రాకేష్, కృష్ణంరాజు, వంశీ, రఘు, రాజీవ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.



## చెట్లు పెంచండి

- **వన మహోత్సవంలో భాగస్వాములు కండి**
- **జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** చెట్లను పెంచడంతో పాటుగా వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి అవి మనుగడ సాగించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం రక్షణ కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద పాఠశాల ఆవరణల్లో పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణలో ఎంతో కీలకమైన మార్పు తీసుకురాగలమన్నారు.ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చదనం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లాలోని ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులు విద్యార్థులు సమష్టిగా కృషి చేసి వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాఠశాల విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పచ్చదనం భావితరాలకు ఉపయోగం

- **ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** చెట్ల పెంపకంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రకాశం స్టేడియంలో మంగళవారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పలువురు వాకర్స్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.మొక్కను నాటడం ఒక కార్యక్రమం మాత్రమే కాదని దానిని సంరక్షించడం మన సామాజిక బాధ్యత అన్నారు. పట్టణాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం వాతావరణ మార్పులు ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ప్రతి విద్యాసంస్థ ప్రతి సంస్థ కనీసం కొన్ని మొక్కలను నాటి వాటి బాధ్యతను తీసుకుంటే పచ్చని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు మనం అందించే విలువైన బహుమతి అని వారు పేర్కొన్నారు. ప్రకాశం స్టేడియం పరిసరాలను మరింత పచ్చగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకర్స్ పాల్గొని మొక్కల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యం.ఎస్. ఫణి, సెక్రటరీ మైనేని మోహన్ రావు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బత్తుల కృష్ణయ్య, ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ పి.వెంకటేశ్వర్ రావు, ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్యతో పాటు పలువురు వాకర్స్ ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు.



## మొక్కలు నాటడమే కాదు.. సంరక్షించాలి

- **పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..**
- **గుట్టమల్లారం రైతువేదికలో వనమహోత్సవం..**

**మణుగూరు, మహా :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని వ్యవసాయ శాఖ అధికారులు పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా మణుగూరు మండలం గుట్టమల్లారం రైతువేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విరివిగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మొక్క నాటడంతో బాధ్యత పూర్తికాదని, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మణుగూరు ఏడీఏ బి.తాతారావు, ఏఓ వి.రాహుల్‌రెడ్డి, హెచ్ఓ సాయికృష్ణ, ఏఈఓ డా.కొమరం లక్ష్మణ్‌రావు, ఆత్మ చైర్మన్ అవుల సర్వేశ్వరరావు, ఆత్మ డైరెక్టర్ కుర్రి చలపతిరావు, గుట్టమల్లారం సర్పంచ్ కారం పూజ, ఉపసర్పంచ్ కొమరం మధుకిరణ్, రైతులు కొండ్రు మల్లేష్, బత్తుల శ్రీనివాసరావు, దొడ్డపనేని మధు తదితరులు పాల్గొన్నారు.



## అవుట్‌డోర్ ఎలక్ట్రికల్ ఉద్యోగులకు కన్వీనియన్స్ వాహనం ఏర్పాటు చేయాలి

**ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్**

**సత్తుపల్లి,: మహా :** సత్తుపల్లి ఏరియా అవుట్ డోర్ ఎలక్ట్రికల్ విభాగం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా కన్వీనియన్స్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్ కోరారు. తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ, జేవీఆర్ డిస్పెన్సరీ, గెస్ట్‌హౌస్, జీఎం బంగ్లాస్, పీవీఎన్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లు, ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన అవుట్ డోర్ పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. గనుల ప్రాంతాలు, కాలనీల్లో విద్యుత్ అంతరాయాలను సకాలంలో నివారించడం, ఎలక్ట్రికల్ పరికరాల తనిఖీలు నిర్వహించడం, అత్యవసర మరమ్మతులను వేగంగా పూర్తి చేయడం వంటి విధులకు ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం సరైన రవాణా సౌకర్యం లేక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అవుట్ డోర్ ఎలక్ట్రికల్ పనులను సక్రమంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా కన్వీనియన్స్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) తరఫున జనరల్ మేనేజర్‌ను కోరినట్లు తెలిపారు. వినతిపై ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి సానుకూలంగా స్పందించి, అవుట్ డోర్ ఎలక్ట్రికల్ విభాగం ఉద్యోగులకు కన్వీనియన్స్ వాహనం ఏర్పాటు చేసే విషయమై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు తీగల క్రాంతికుమార్ వెల్లడించారు.

## సీతారామా బాదిత రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి

**దమ్మపేట ,మహా :** దమ్మపేట మండల పరిదిలో ఉన్న జగ్గారం పంచాయతీ గిరిజన రైతుల గోడు పట్టించుకోవాలని ,సీతారామా కాలవ వలన నష్టపోయిన రైతులకు పరిహారం సక్రమంగా అందించాలని కోరుతూ నేషనల్ షెడ్యూల్ యస్టీ కమీషన్ జాటోత్ హుస్సేన్ నాయక్ కు మంగళవారం గిరిజన నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలక్టరేట్ కు వచ్చిన హుస్సేన్ నాయక్ ను ఆదివాసి గిరిజన రాష్ట్ర నాయకులు కారం శ్రీరాములు కలిసి కొద్దిసేపు ముచ్చటించిన అనంతరం సంభందిత భాదితుల వివరాలు తెలియజేస్తూ ,సీతారామా కాలువ వలన నష్టపోతున్న గిరిజన రైతులను ఆదుకోవాలని కోరారు. గత 15 సంవత్సరాల క్రితం ప్రకటించిన ఎకరానికి 8లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇంతవరకూ అందజేయక పోగా ,నేడు పెరిగిన భూ విలువల ప్రకారం పెంచకుండా పాత భూ విలువల ప్రకారం ఇస్తామనడం సరైంది కాదనే అభిప్రాయం కారం శ్రీరాములు వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనే జాతీయ ఎస్టీ కమీషన్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకూ ఎటువంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత గిరిజన రైతాంగానికి స్థానికంగా ఉన్న పాలకులు ,అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కారం వెంట మరికొందరు గిరిజన రైతులు ఉన్నారు.





## రుచి శుచిగా భోజనం

**ఆదిలాబాద్ మహా:** అదిలాబాద్ పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మంగళవారం సందర్శించారు. డీఎండబ్ల్యూ ఖలీంతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ భోజనం నాణ్యత, రుచిని స్వయంగా తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులకు అందించే భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ శానిటేషన్ ఎస్ఐ శంకర్, నారాయణరెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికిరణ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పూలు పండ్ల మొక్కలు పంపిణీ చేయాలి

- మున్సిపల్ చైర్ పర్సన్
- హార్టికల్చర్ కళాశాల, పరిశోధన కేంద్రాల సందర్శన
- వివిధ మొక్కల పరిశీలన

ఆదిలాబాద్ మహా : హోమ్‌స్టెడ్ ప్లాంటేషన్‌లో భాగంగా పూలు పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా అధికారులకు సూచించారు. మంగళవారం అదిలాబాద్ పట్టణంలోని హార్టికల్చర్ కళాశాల, పరిశోధన కేంద్రాలను డాక్టర్ మల్లేష్ తో పరిశీలించారు. మున్సిపాలిటీ తరఫున ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేయనున్న మొక్కలను స్వయంగా పరిశీలించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటా పంపిణీ చేసేందుకు మల్లె, గులాబీ, మందారం, చామంతి, మనీ ప్లాంట్, ఉసిరి, కరివేపాకు తదితర పూలు, పండ్ల మొక్కలను ఎంపిక చేసి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల ప్రాంగణాల్లో నాటేందుకు మునగ, నిమ్మ, జామ తదితర పండ్ల మొక్కలను సిద్ధం చేసి సరఫరా చేయాలని సూచించారు. మున్సిపాలిటీ తరఫున కొనుగోలు చేస్తున్న ప్రతి మొక్కను నాణ్యతతో పరిశీలించి, ప్రజలకు ఉపయోగకరంగా ఉండే మొక్కలను మాత్రమే ఎంపిక చేయాలని ఆమె స్పష్టం చేశారు. పట్టణంలోని సెంట్రల్ డివైడర్ల వద్ద నాటేందుకు అనువైన మొక్కలను కూడా పరిశీలించారు. వేసవి కాలంలో ఎండిపోయిన మొక్కలను గుర్తించి తొలగించి, వాటి స్థానంలో నూతన మొక్కలను నాటాలని మున్సిపల్ అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ఇంటింటా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎండబ్ల్యూ ఖలీం మున్సిపల్ కౌన్సిలర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అవికిరణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, మున్సిపల్ అధికారులు, హార్టికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ఉనికి కోసమే రేగా ఆరోపణలు..

- ప్రభుత్వంపై నిరాధార విమర్శలు మానుకోవాలి
- రేగ వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి..
- మణుగూరు మండల కాంగ్రెస్ నేతలు



**మణుగూరు, మహా** : రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మంగళవారం మణుగూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేగా చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. సుమారు 25 రోజుల పాటు ప్రజలకు దూరంగా ఉండి ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాలతోనే రేగా రెండుసార్లు రాజకీయంగా ఎదిగారని పేర్కొన్నారు. ఒక మహిళకు సంబంధించిన కేసు విషయంలో న్యాయస్థాన పరిణామాలను తనకు అనుకూలంగా చిత్రీకరించుకుంటూ నిజాయితీ గురించి మాట్లాడటం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. గతంలో రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను కూడా వారు తప్పుబట్టారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని నేతలు విమర్శించారు. గతంలో దళితబంధు, లక్ష రూపాయల రుణాల మంజూరు విషయంలో లబ్ధిదారులను కమీషన్ల కోసం ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలకు రేగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పేరుతో మణుగూరులో రాజకీయ ర్యాలీలు నిర్వహించడం వెనుక ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. సమస్యలుంటే ప్రభుత్వ స్థాయిలో ప్రస్తావించాలని సూచించారు. మణుగూరులో భూములకు సంబంధించిన వ్యవహారాలపై కూడా రేగా ప్రజలకు వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ట్రస్టులు, దేవాలయాల పేరుతో భూముల ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలతో పాటు, ఆక్రమిత భూములకు రైతుబంధు ప్రయోజనాలు పొందారన్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మరోసారి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో గతంలో రేగా వ్యవహరించిన తీరును ప్రస్తావిస్తూ, ఇప్పుడు తెలంగాణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీపై అడ్డగోలు ఆరోపణలు మానుకోవాలని, ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, రాష్ట్ర నాయకుడు సామా శ్రీనివాసరెడ్డి, శివ సైదులు, బానోత్ లక్ష్మణ్, రామ్‌రెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, సర్పంచులు కలబోయిన మాధవరావు, పూణేం రమేష్, పాల్వంచ రాములు, ఎనిక శ్వేత, ఉపసర్పంచులు గాండ్ల సురేష్, గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు కొలపిన్ని మానస, కృష్ణవేణి, జిల్లా నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, కూచిపూడి బాబు, గణేష్‌రెడ్డి, మహిళా నాయకురాలు వరలక్ష్మి, నాయకులు మధుబాబు, కటుకూరి శ్రీను, బత్తుల శ్రీను, వాసంశెట్టి వెంకట్రావు, గుమాస్తాల సంఘం నాయకులు తాతా ప్రసాద్, శ్రీను, 12 టైర్ యూనియన్ నాయకుడు సురేందర్ రెడ్డితో పాటు మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చలగాటం వద్దు.. సమస్యలు పరిష్కరించండి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్
- సమస్యల సాధన కోసం ప్రారంభమైన నిరసన దీక్ష శిబిరం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ హెచ్చరించారు. పెంచిన భారాన్ని తగ్గించాలని ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం అంగీకరించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక బడ్జెట్ను కేటాయించాలని కోరుతూ కొత్తగూడెం డిపో నందు మంగళవారం స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూ ఎఫ్) సిఐటియు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష శిబిరాన్ని చేపట్టారు. ఈ దీక్ష శిబిరాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ కోసం ఎస్డబ్ల్యుఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి దశల వారి ఉద్యమాలు చేపట్టడం వల్ల కనీస స్థాయిలో ఆర్టీసీ సంస్థను రక్షించుకోవడం జరుగుతుందన్నారు. రోజురోజుకు సమస్యలు పెరిగిపోతూ ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సంవత్సర కాలంలో సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకత్వంలో పలుమార్లు సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఏమాత్రం కార్మికుల పట్ల ప్రేమ లేకుండా తన ఇష్టానుసారం వచ్చినట్లు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నిరసనగా ఆర్టీసీ సంఘాల నాయకత్వంలో సమ్మెకు సిద్ధమవడం జరిగిందన్నారు. 17 రకాల అంశాలతో సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం తరపున సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. పే స్కేలు ఏరియర్స్ ఉద్యోగ భద్రత రిక్రూట్మెంట్ ప్రమోషన్స్ తదితర డిమాండ్ల సాధన కోసం కనీస అవసరాలు తీర్చాలని కార్మికుల కోరుతున్నప్పటికీ పాలకవర్గం ఆర్టిసి యాజమాన్యం చేస్తున్న నిర్లక్ష్య పద్ధతికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో కార్మిక సంఘాలు లేవని సమస్యలు అంతకంటే లేవని సంఘం పెట్టి ధర్నా చేస్తే ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వనికి కార్మికులు తగిన గుణపాఠం చెప్పి గద్దె దింపిన చరిత్రను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఏరియర్స్ పే స్కేలు అన్ని అమలు చేస్తామని రిక్రూట్మెంట్ కూడా చేస్తామని చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దనెక్కి మాటలు మార్చి కార్మికుల మోసం చేయడం కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. తక్షణమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు కార్మికవర్గ సంక్షేమం కోసం పెట్టిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఐక్య ఉద్యమాలను ఉధృతం చేసి పోరాటాలను కొనసాగిస్తామన్నారు.

**సిపిఎం సంఘీభావం...**

ఆర్టీసీ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం సంఘీభావం తెలిపింది. సిపిఎం 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి మాట్లాడుతూ ఎస్డబ్ల్యుఎఫ్ చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కార్మిక వర్గానికి అన్ని విధాలుగా నష్టం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతుందన్నారు. భవిష్యత్తు పోరాటాలకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరోక్షంగా ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. డిపో అధ్యక్షులు బత్తుల నాగేశ్వరావు మాట్లాడుతూ అంగీకరించిన అంశాలను కూడా ఆర్టీసీ మేనేజ్మెంట్ ఆటంకం కలిగిస్తుందన్నారు. తక్షణమే ఆ అంశాలను అమలు చేయాలన్నారు. డిపో కార్యదర్శి ఇసనపల్లి శామ్యూల్ మాట్లాడుతూ సంపూర్ణ ఐక్యతతో సమ్మె చేసి ఏడు సంవత్సరాల తర్వాత ప్రభుత్వ చొరవతో యాజమాన్యం చర్చలు నిర్వహించి అంగీకరించిన అంశాలు కూడా అమలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని అన్నారు. అంగీకరించిన అంశాలు కార్మిక సంఘాలతో చర్చించి పెంచిన పనిభారాలు తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎస్ కే రఫీ, ఇసనపల్లి యాకోబు, పి.రామకృష్ణ, బి.రామకృష్ణ, పి.శ్రీనివాస్, పి.బాబు, ధనరాజ్, ఇర్షా ఆలీ, రామ్ మూర్తి, లోకరక్షకుడు, కేశవరావు, మహిళ ఎస్డబ్ల్యుఎఫ్ నాయకులు మోహిని, కరుణ, సబిత దీక్ష శిబిరన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి లిక్కిం బాలరాజ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నాయకులు గడల నరసింహారావు, కొత్తపల్లి రమేష్ బాబు, సిఐటియు నాయకులు బాలకృష్ణ నసూర్, ప్రముఖ ఐలు జిల్లా నాయకులు న్యాయవాదులు కే.పుల్లయ్య, శ్రీనివాస్ ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్ లక్ష్మి, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి పెద్ద పీట



**ఆదిలాబాద్ మహా:** విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక బొక్కల్‌గూడ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన నూతన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటి నీరు పోశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యధికంగా 1,200 మంది విద్యార్థులతో నాలుగు మీడియాలలో విద్యాబోధన సాగుతున్న ఈ కళాశాల జిల్లాకే తలమానికమని కొనియాడారు. అసంపూర్తిగా ఉన్న మొదటి అంతస్తులోని నాలుగు నూతన గదులను ఖర్చుకు వెనుకాడకుండా పూర్తి చేసి నేడు ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులు సాధించి, కళాశాలకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతోనే భవిష్యత్ ఉందని, అధ్యాపకులను గౌరవించి సలహాలు సూచనలు పాటించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క చొప్పున నాటి పరిరక్షించాలని అన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమంటో లను కలెక్టర్, అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డీఐఈవో గణేష్ జాదవ్, డీఎంబ్ల్యూవో కలీం, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు సుచిక, సుష్మా, సంజయ్, జీవన్, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాటల్లో పెట్టి ...డబ్బులు నొక్కేసి



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్‌ను మాటల్లో పెట్టి, అతని మొబైల్ తీసుకుని ఫోన్‌పే ద్వారా 17వేల నగదును తన ఖాతాకు బదిలీ చేసుకుని మోసానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణంలోని బొక్కలగూడకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ హాది ఈ నెల 21న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో నడుపుతుండగా, ఓ మహిళ ఆమె కుమారుడు ఖండాల గ్రామానికి వెళ్లేందుకు ఆటోను అద్దెకు తీసుకున్నారు. మహిళను ఖండాల వద్ద దించిన అనంతరం ఆమెతో వచ్చిన వ్యక్తి మరో ప్రాంతానికి 2 వేలకు అదే ఆటో మాట్లాడుకున్నాడు. ఆదిలాబాద్ కు చేరుకున్న సమయంలో తన ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందంటూ ఆటో డ్రైవర్ మొబైల్ ఫోన్‌ను తీసుకుని ఫోన్ చేసినట్లు నటించాడు. అనంతరం నిందితుడు ఆటో డ్రైవర్‌కు తెలియకుండా అతని ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా 17వేల రూపాయలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. మరుసటి రోజు ఫోన్‌పే లావాదేవీలను పరిశీలించిన ఆటో డ్రైవర్ విషయం గుర్తించి సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు ఆదిలాబాద్ రూరల్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్ కు చెందిన రాథోడ్ యువరాజ్ గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 10వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కూడా 8 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన టూ టౌన్ పోలీసులను డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ఎస్ఐలు అఖిల్, ప్రణయ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 403, 129లలో అక్రమ నిర్మాణాలు

- అధికార యంత్రాంగం మౌనమేల..!?
- జాతీయ రహదారి పక్కనే నిబంధనలకు తూట్లు



మందమర్రి, మహా : రాష్ట్రంలో ఎక్కడ ఏ చిన్న అక్రమ నిర్మాణం జరిగినా క్షణాల్లో రంగంలోకి దిగాల్సిన టౌన్ ప్లానింగ్ (డిపిఓ) శాఖ అధికారులు జాతీయ రహదారిని ఆనుకుని సర్వేనెంబర్ 403 లో జరుగుతున్న భారీ అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం పూర్తిగా విఫలమవుతుందనే విమర్శలు తీవ్రతరమవుతున్నాయి. నిబంధనలకు పాతర వేసి, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వెలుస్తున్న ఈ నిర్మాణాలపై మందమర్రి పట్టణంలో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సర్వే నంబర్ 403, 129 లలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు**

ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలాలలో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు వెలుస్తున్నప్పటికీ, సంబంధిత ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ యంత్రాంగం ఏ మాత్రం ఇవేవీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రోజువారీ రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పక్కనే ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, తనిఖీ చేయాల్సిన (టిపిఓ) అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**పట్టించుకోని అధికార యంత్రాంగం**

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికార ప్రభుత్వ యంత్రాంగం మొద్దునిద్ర వీడకపోవడంపై పట్టణంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ మార్గదర్శకాలను బేఖాతరు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**ప్రేక్షక పాత్రలో గిరిజన, ఆదివాసి సంఘాలు**

ఈ అక్రమ నిర్మాణాల పర్వం ఇలా సాగుతుంటే, స్థానిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడాల్సిన గిరిజన, ఆదివాసి సంఘాల నేతలు సైతం కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితం కావడం గమనార్హం. తమ ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలను, నిబంధనల ఉల్లంఘనలను ప్రశ్నించాల్సిన సంఘాలు మౌనం వహించడం వెనుక అసలు రహస్యం ఏంటనే చర్చ మేధావి వర్గాల్లో వ్యక్తమౌతుంది.

**తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సర్వే నంబర్ 403, 129 లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరపాలని, సంబంధిత బాధ్యులైన వారిపై విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర పార్టీల నేతలు కోరుతున్నారు.

# కదం తొక్కిన కలం సైన్యం

- జాగ కోసం జైలు భరో కైనా సిద్ధం
- జర్నలిస్టుల పాదయాత్రకు ప్రెస్ క్లబ్, పార్టీల సంఘీభావం

**కారేపల్లి, మహా:** ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టుల కదం తొక్కారు. టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రం కారేపల్లి చేరుకుంది. కారేపల్లి జర్నలిస్టులు పాదయాత్రకు ఆపూర్వ స్వాగతం లభించింది. కొమరం భీం సెంటర్ లో కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి ప్రారంభించిన పాదయాత్రకు కారేపల్లి ప్రెస్ క్లబ్ సంఘీభావం ప్రకటించింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల కోసం పాదయాత్ర కు శ్రీకారం చుట్టటం అభినందనీయమన్నారు. యూనియన్లకు అతీతంగా ఇండ్ల స్థలాల పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శ కే.నరేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు సంఘీభావం తెల్పి జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బానోత్ రాంమ్మూర్తి, తోటకూరి రాంబాబు, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగొడ ఐలయ్య, దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత లు మాట్లాడుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నేతృత్వంలో మండల విలేకరులకు ఇండ్ల స్థలాల సాధిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు హన్మకొండ రమేష్, రావూరి శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, అజ్మీర వీరన్న లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బోళ్ల రామస్వామి, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు గుమ్మడి సందీఫ్, గుగులోత్ తేజా, న్యూడెమోక్రసీ నాయకులు భూక్య శివానాయక్, అంబేదర్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆదెర్ల రాములు, బీఎస్పీ జిల్లా నాయకులు దామళ్ల సత్యనారాయణ ఆటో యూనియన్ అధ్యక్షులు నాగవెల్లి ప్రభాకర్ లు మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన పోరాటంలో వెన్నంటే ఉంటామన్నారు. పాదయాత్ర బస్టాండ్ సెంటర్ లో మహాత్మగాంధీ విగ్రహం, అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈసందర్భంగా తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపిడీవో పద్మలకు వినతిప్రతాలు అందజేశారు. ప్రభుత్వ పరంగానే కాకుండా ప్రత్యేక చొరవతో ఇండ్లస్థలాలు సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు.

**జాగ కోసం జైల్ భరో కైనా సిద్ధం**

జర్నలిస్టుల ఇండ్ల జాగా కోసం జైల్ భరోకైనా సిద్ధంని, జర్నలిస్టుల న్యాయమైన ఇండ్ల స్థలాల పోరాటం మహత్తరమైందని టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఖదీర్, కే.శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ లు అన్నారు. పాదయాత్రను ఉద్దేశించి వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పాదయాత్రం పార్టీలు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కాదని, సమస్యను పాలకుల దృష్టికి తీసుకరావటం, ప్రజాపాలకులపై ఒత్తిడి తేవటానికేనన్నారు. ఎన్నో ఏండ్లుగా ఇండ్ల స్థలాల సాధనకు కోసం పోరాటాలు చేస్తున్నాము. ఇక ఈ పోరాటం ఇండ్ల స్థలాలు సాధించేవరకు విశ్రమించదన్నారు. పాదయాత్ర ఉత్సహభరితంగా సాగింది. ఇల్లందు ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు సంఘీబావం ప్రకటించి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, షేక్ జానీ పాషా, టీబీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుకొండ రవికిరణ్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు టిఎస్ చక్రవర్తి, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ నలుబోలు మధుశ్రీ, మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు , ఎన్.డి కర్ణ, దగ్గుపాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, కారేపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తేళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి పాలిక శ్రీను, పగడాల నాగేశ్వపావు, టీడబ్ల్యూజేఎఫ్ మండల నాయకులు బోడ అశోక్, భాగం నాగేశ్వరరావు, గుడెల్లి శ్రీనివాసరావు, తోగల సతీష్, దమ్మాలపాటి కృష్ణ, నాయకులు గణేష్, శరత్, యూసుఫ్, అర్షత్, రవికుమార్, ఇంటి ప్రసాద్, తిరుపతిరావు, పవన్, భవాని, పాల్గొన్నారు.






## భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 76లో భూవివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. డైమండ్ సిటీ వెంచర్‌లోని 1,600 గజాల స్థలంలో 200 గజాల విషయంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. తాము ఏళ్లుగా స్థలాన్ని అనుభవిస్తున్నామని గుడాల కృష్ణగౌడ్ వర్గం చెబుతుండగా, సంబంధం లేని వ్యక్తులు వచ్చి స్థలాన్ని అడ్డుకుంటున్నారని ప్రత్యర్థి వర్గం ఆరోపించింది. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులపై వివరాలు సేకరిస్తున్నారు.

# దివి ట్రావెల్ ఫొటో వైరల్



హైదరాబాద్‌కు చెందిన నటి దివి వద్త్యా తాజాగా తన ట్రావెల్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. అమెరికాలోని సియాటిల్‌లో ఉన్న ప్రసిద్ధ 'గమ్ వాల్' వద్ద ఆమె సందడి చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రంగురంగుల చ్యూయింగ్ గమ్‌లతో నిండిపోయిన ఈ ప్రత్యేక ప్రదేశం వద్ద దివి క్యాజువల్ లుక్‌లో కనిపిస్తూ ఫొటోకు పోజిచ్చింది. బ్లూ ట్యాంక్ టాప్, లైట్ కలర్ ప్యాంట్ ధరించి, జడ వేసుకున్న ఆమె సింపుల్ లుక్‌లో కనిపించింది. సియాటిల్‌లోని ఈ ప్రత్యేకమైన టూరిస్ట్ స్పాట్ బ్యాక్‌డ్రాప్‌లో దివి ఇచ్చిన పోజులు ట్రావెల్ లవర్స్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి.1996 మార్చి 15న హైదరాబాద్‌లో జన్మించిన దివి వద్త్యా.. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసిన ఆమె 2017లో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. 2018లో 'లెట్స్ గో' అనే షార్ట్ ఫిల్మ్‌తో నటనను ప్రారంభించింది. 2019లో మహేశ్‌బాబు నటించిన 'మహర్షి' చిత్రంతో వెండితెరపై అడుగుపెట్టింది. 2020లో ప్రసారమైన 'బిగ్ బాస్ తెలుగు 4'లో కంటెస్టెంట్‌గా పాల్గొనడంతో దివికి మరింత పాపులారిటీ వచ్చింది. ఆ తర్వాత 'ఏ1 ఎక్స్‌ప్రెస్', 'పుష్ప: ది రైజ్', 'గాడ్‌ఫాదర్', 'లంబసింగి', 'సింబా', 'పుష్ప: ది రూల్-పార్ట్ 2' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించింది. 'జాట్' చిత్రంలో పోలీస్ అధికారిణి పాత్రలో కనిపించి మెప్పించింది. ప్రస్తుతం 'హనీ'తో పాటు మరికొన్ని తెలుగు ప్రాజెక్టుల్లో నటిస్తూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. గ్లామర్ పాత్రలతో పాటు కథకు ప్రాధాన్యమున్న క్యారెక్టర్ రోల్స్‌ను ఎంచుకుంటూ దివి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది.



# సంక్రాంతి బరిలో రవితేజ కొత్త సినిమా

'ఇరుముడి'తో బాక్సాఫీస్ వద్ద మంచి జోష్‌లో ఉన్న మాస్ మహారాజా రవితేజ.. తన తదుపరి సినిమాను కూడా అధికారికంగా ప్రకటించారు. ఈసారి సంక్రాంతి సీజన్‌ను టార్గెట్ చేస్తూ కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. రవితేజ కెరీర్‌లో ఇది 64వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కనుంది. వైవిధ్యమైన కథలు, కొత్త తరహా ట్రీట్‌మెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హసిత్ గోలి ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. రవితేజకు ఉన్న మాస్ ఇమేజ్‌కు సరిపోయేలా కథను రూపొందిస్తూనే.. కామెడీ, యాక్షన్, ఎమోషన్ వంటి అంశాలను మేళవించి పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్‌గా సినిమాను తెరకెక్కించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రేక్షకులకు ఫ్రెష్ ఫీల్ ఇచ్చేలా కథ, పాత్రలను డిజైన్ చేస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది.ఈ సినిమాను 2027 జనవరి 14న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. అనౌన్స్‌మెంట్‌తో పాటు విడుదల చేసిన ట్యాగ్‌లైన్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'దాగుడు మూతలు దండాకోర్.. ఎంటర్టైన్మెంట్ హార్డ్ కోర్' అనే క్యాచీ లైన్‌తో సినిమాపై ఆసక్తిని పెంచారు. ఈ ట్యాగ్‌లైన్ చూస్తుంటే సినిమాలో రవితేజకు సూటయ్యే మాస్ కామెడీ, ఎంటర్టైన్మెంట్‌కు పెద్దపీట వేసినట్లు అర్థమవుతోంది.రవితేజ కామెడీ టైమింగ్, ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌కు హసిత్ గోలి దర్శకత్వ శైలి కలిస్తే సినిమా మరింత ఆసక్తికరంగా ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమాను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. పండుగ వాతావరణానికి సరిపోయే ఎంటర్టైన్మెంట్, మాస్ అంశాలతో థియేటర్లలో సందడి చేసేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక దిల్ రాజు నిర్మాణంలో రవితేజ నటించనుండటం, హసిత్ గోలి దర్శకత్వం వహించనుండటంతో ఈ కాంబినేషన్‌పై మొదటి నుంచే అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే 'ఇరుముడి'తో మంచి ఫామ్‌లో ఉన్న రవితేజ.. ఈ సినిమాతోనూ అదే జోరును కొనసాగించాలని చూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన హీరోయిన్, సంగీత దర్శకుడు, ఇతర కీలక సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ దశలవారీగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.మరోవైపు ఈ సినిమాకు 'వీరాధివీరులంట' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. టైటిల్, కాస్టింగ్, ఫస్ట్ లుక్ వంటి వివరాలు బయటకు వచ్చిన తర్వాత సినిమాపై మరింత హైప్ పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా 2027 సంక్రాంతి బరిలో రవితేజ ఎంట్రీతో బాక్సాఫీస్ పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది.

# కామెడీ బాటలోకి అల్లరి నరేష్



టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్, మేనరిజంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు అల్లరి నరేష్. ఒకప్పుడు వరుస హాస్య చిత్రాలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ బ్యాక్ టు బ్యాక్ విజయాలు అందుకున్నారు. అయితే కాలంతో పాటు ప్రేక్షకుల అభిరుచులు మారడంతో నరేష్ కూడా తన కెరీర్‌లో కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. కేవలం కామెడీ పాత్రలకే పరిమితం కాకుండా సీరియస్ కథలు, విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనలో మరో కోణాన్ని చూపించే ప్రయత్నం చేశారు.ఈ క్రమంలోనే 'నాంది' సినిమాతో నరేష్‌కు మంచి ప్రశంసలు దక్కాయి. గతంలో చూసిన కామెడీ హీరోకు భిన్నంగా సీరియస్ పాత్రలో ఆయన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతో ఇకపై నరేష్ ఎక్కువగా సీరియస్, యాక్షన్, థ్రిల్లర్ కథలకే ప్రాధాన్యం ఇస్తారని అప్పట్లో టాక్ వినిపించింది. ఆ తర్వాత కూడా ప్రయోగాత్మక చిత్రాలను ఎంచుకున్నప్పటికీ.. కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోలేకపోయాయి.కథలు, పాత్రల్లో ప్రయోగాలు ఉన్నప్పటికీ నరేష్ నుంచి ప్రేక్షకులు ఆశించే వినోదం తగ్గిపోవడంతో అభిమానుల్లోనూ కొంత నిరాశ కనిపించింది. ఈ విషయాన్ని గమనించిన నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన కామెడీ జోనర్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి పాత తరహా కామెడీ కాకుండా కొత్త కథలు, ఫాంటసీ అంశాలు, ఫ్రెష్ ఎంటర్టైన్మెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.ప్రస్తుతం నరేష్ చేతిలో 'రంభా ఊర్వశి మేనక' అనే ఫాంటసీ ఎంటర్టైనర్ ఉంది. చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. అనుకోని పరిస్థితుల్లో దేవకన్యలు భూమిపైకి రావడం, వారి కారణంగా హీరో జీవితంలో ఎదురయ్యే పరిణామాల చుట్టూ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. టీజర్‌కు వచ్చిన స్పందన కూడా సినిమాపై అంచనాలను పెంచింది.ఇదే సమయంలో 'సభకు నమస్కారం', 'కనక దుర్గ' వంటి మరికొన్ని వినోదాత్మక ప్రాజెక్టుల్లోనూ నరేష్ నటిస్తున్నారు. దీంతో ఒకేసారి విభిన్నమైన కామెడీ కథలను ఎంచుకుంటూ తన పాత జోనర్‌కు దగ్గరవుతున్నారు. నరేష్ మళ్లీ తన మార్క్ కామెడీ, టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తే బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు రావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి.అయితే నరేష్‌కు సీరియస్ పాత్రలు, యాక్షన్ కథలు పూర్తిగా సెట్ కావన్నది మాత్రం కాదు. 'మహర్షి'లో మహేశ్‌బాబు స్నేహితుడిగా, రైతు కుటుంబానికి చెందిన యువకుడి పాత్రలో నరేష్ తన నటనతో మెప్పించారు. ఆ సినిమా తర్వాత ఆయన కెరీర్‌లో మరో దశ ప్రారంభమవుతుందని అభిమానులు భావించారు. 'నాంది' కూడా ఆయనలోని నటుడిని కొత్తగా పరిచయం చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన కొన్ని కథలు ప్రేక్షకులతో ఆశించిన స్థాయిలో కనెక్ట్ కాకపోవడంతో ఆయనకు వరుస విజయాలు దక్కలేదు. ప్రస్తుతం మాత్రం నరేష్ తన బలమైన కామెడీ జోనర్‌తో పాటు కొత్త తరహా కథలను కలిపి ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. సీరియస్ పాత్రల్లో తన ప్రతిభను నిరూపించుకున్న తర్వాత మళ్లీ నవ్వులు పంచే పాత్రల్లోకి రావడం అభిమానులకు సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ కొత్త సినిమాలు నరేష్‌కు మరోసారి బలమైన కమ్‌బ్యాక్ ఇస్తాయా? ఆయన పాత కామెడీ మ్యాజిక్‌ను తిరిగి తీసుకొస్తారా? అనేది సినిమాల విడుదల తర్వాతే తేలనుంది.



# నక్షత్ర నటనకు ధనుష్ ఫిదా

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మంచి సందడి చేస్తున్న 'ఇరుముడి' చిత్రానికి ప్రేక్షకులతో పాటు సినీ ప్రముఖుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సినిమాలో రవితేజ కుమార్తెగా నటించిన బాలనటి నక్షత్ర తన సహజమైన నటనతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చిన్న వయసులోనే భావోద్వేగ సన్నివేశాలను ఎంతో పరిణతితో పండించిన ఆమె నటన ప్రేక్షకులను కట్టిపడేస్తోంది.తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో, జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ కూడా నక్షత్ర నటనను ప్రత్యేకంగా ప్రశంసించినట్లు తెలుస్తోంది. ఇటీవల 'ఇరుముడి' చిత్రాన్ని వీక్షించిన ధనుష్.. నక్షత్ర పెర్ఫార్మెన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యారని సమాచారం. దర్శకుడు శివ నిర్వాణ ద్వారా ఆమెతో వీడియో కాల్‌లో మాట్లాడిన ఆయన.. సినిమాలో ఆమె చూపించిన భావోద్వేగాలను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ధనుష్ అడిగిన ఓ సరదా ప్రశ్న నక్షత్రను ఆశ్చర్యానికి గురిచేసింది. "నీ నటన చాలా బాగుంది.. నాకు కూడా యాక్టింగ్ నేర్పిస్తావా?" అంటూ ధనుష్ అడగడంతో ఆ చిన్నారి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయినట్లు తెలుస్తోంది. అంతటి స్టార్ హీరో తన నటనను మెచ్చుకోవడంతో ఆమెకు ఇది ప్రత్యేకమైన అనుభూతిగా మారింది. నక్షత్రతో మాట్లాడిన అనంతరం త్వరలోనే నేరుగా కలుస్తానని ధనుష్ చెప్పినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ధనుష్ వంటి ప్రముఖ నటుడి నుంచి చిన్న వయసులోనే ఇలాంటి ప్రశంసలు రావడం నక్షత్రకు గొప్ప గుర్తింపుగా అభిమానులు భావిస్తున్నారు. 'ఇరుముడి'లో నక్షత్ర పోషించిన 'మణమ్మ' పాత్రకు మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా మాటల కంటే కళ్లతోనే భావాలను పలికించే సన్నివేశాల్లో ఆమె చూపించిన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఎమోషనల్ సీన్లలో సహజమైన హావభావాలతో మెప్పించడం సినిమాకు అదనపు బలంగా మారింది. ఇప్పటికే ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్న నక్షత్రకు ఇప్పుడు ఇండస్ట్రీ నుంచి కూడా అభినందనలు రావడంతో ఆమెపై ఆసక్తి మరింత పెరిగింది. భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తే బాలనటిగా మాత్రమే కాకుండా కథానాయికగా కూడా రాణించే అవకాశం ఉందని సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా 'ఇరుముడి'లోని మణమ్మ పాత్ర నక్షత్రకు మంచి గుర్తింపును తీసుకొచ్చిందనే చెప్పాలి.

# 'ఆశ్రమ్ 4'పై పెరిగిన అంచనాలు




ఓటీటీలో ఎన్నో వెబ్‌సిరీస్‌లు వస్తుంటాయి.. కొంతకాలం ప్రేక్షకులను ఆకట్టుకుని ఆ తర్వాత కనుమరుగవుతుంటాయి. అయితే కొన్ని సిరీస్‌లు మాత్రం కథ, పాత్రలు, ట్రీట్‌మెంట్ కారణంగా ప్రేక్షకులపై ప్రత్యేకమైన ముద్ర వేస్తాయి. అలాంటి వాటిలో 'ఆశ్రమ్' సిరీస్ ఒకటిగా నిలిచింది. 2020లో ప్రారంభమైన ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు ఇప్పటికీ ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్ ఉంది. ఇప్పటికే మూడు సీజన్లలో 33 ఎపిసోడ్లను ప్రేక్షకులు వీక్షించగా.. ఇప్పుడు నాలుగో సీజన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ సిరీస్ బాబీ డియోల్ కెరీర్‌కు కూడా కొత్త ఊపును తీసుకొచ్చింది. 'బాబా నిరాలా' అనే ప్రతికూల ఛాయలున్న పాత్రలో ఆయన చేసిన నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గతంలో సినిమాల్లో హీరోగా, ఇతర పాత్రల్లో కనిపించిన బాబీ.. 'ఆశ్రమ్'లో పూర్తిగా భిన్నమైన షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను పోషించారు. పాత్రలోని ప్రశాంతత, స్వార్థం, కుట్రలు, అధికార దాహాన్ని తన నటనతో చూపించడంతో ఓటీటీ ప్రేక్షకుల్లో ఆయనకు మరింత గుర్తింపు వచ్చింది.దర్శకుడు ప్రకాశ్ ఝా రూపొందించిన ఈ సిరీస్ 2020లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. తొలి సీజన్‌కు వచ్చిన స్పందనతో కథను కొనసాగిస్తూ వరుసగా తదుపరి సీజన్లను తీసుకొచ్చారు. మొదటి సీజన్‌లో తొమ్మిది ఎపిసోడ్లు ఉండగా.. ఆ తర్వాతి సీజన్ కూడా తొమ్మిది ఎపిసోడ్లతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కథలో పెరుగుతున్న ఉత్కంఠ, బాబా నిరాలా చుట్టూ చోటుచేసుకునే పరిణామాలు సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా మారాయి.మూడో సీజన్‌ను రెండు భాగాలుగా విడుదల చేశారు. మొదటి భాగంలో పది ఎపిసోడ్లు ఉండగా.. రెండో భాగంలో మరో ఐదు ఎపిసోడ్లు వచ్చాయి. దీంతో ఇప్పటివరకు మొత్తం మూడు సీజన్లలో 33 ఎపిసోడ్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఈ సిరీస్ అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.మూడో సీజన్‌తో కథ ముగిసిందని భావించిన అభిమానులకు ఇప్పుడు మరోసారి ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. 'ఆశ్రమ్ 4' పనులు ప్రారంభమైనట్లు సమాచారం. నాలుగో సీజన్ షూటింగ్‌కు శ్రీకారం చుట్టడంతో బాబీ డియోల్ మరోసారి బాబా నిరాలా పాత్రలో కనిపించనున్నారని స్పష్టమైంది. అయితే కొత్త సీజన్ కథ ఎలాంటి మలుపులు తిరుగుతుంది? గత సీజన్లలో మిగిలిపోయిన ప్రశ్నలకు ఎలాంటి సమాధానాలు దొరుకుతాయి? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.గత సీజన్లలో ఆశ్రమం చుట్టూ ఏర్పడిన వివాదాలు, నేరాలు, రాజకీయ ప్రభావం, అధికార పోరాటాలు, వ్యక్తిగత సంబంధాలు కథను నడిపించాయి. నాలుగో సీజన్‌లో ఈ అంశాలు మరింత ఉత్కంఠభరితంగా చూపించే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. బాబా నిరాలా పాత్రకు సంబంధించిన తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్నదే ప్రధాన ఆసక్తిగా మారింది.'ఆశ్రమ్ 4' కూడా అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే విడుదల తేదీపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. షూటింగ్ ప్రారంభమైన నేపథ్యంలో సిరీస్ స్ట్రీమింగ్‌కు రావడానికి మరికొంత సమయం పట్టవచ్చు. ఆరేళ్లుగా ప్రేక్షకులతో ప్రయాణిస్తున్న ఈ సిరీస్‌కు నాలుగో సీజన్ మరింత ఆసక్తిని పెంచుతోంది.

# రెడ్ గౌన్‌లో రుక్మిణి వసంత్



కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ మరోసారి తన గ్లామర్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఎరుపు రంగు స్ట్రాప్‌లెస్ గౌన్‌లో సొగసుగా కనిపిస్తూ కెమెరాకు వార్మ్ స్మైల్ ఇచ్చిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. డ్రమాటిక్ సర్క్యులర్ స్పాట్‌లైట్ ముందు ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ పోజులు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫ్లోయింగ్ సిల్హౌట్‌తో కూడిన ఈ గౌన్‌లో రుక్మిణి చాలా ఎలిగెంట్‌గా కనిపించింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన తాజా ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.చెన్నైలో తనకు లభించిన ప్రేమపై రుక్మిణి భావోద్వేగంగా స్పందించింది. చెన్నై వేదికపై అభిమానుల నుంచి వచ్చిన అపారమైన ప్రేమ తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని పేర్కొంది. ఇలాంటి క్షణాలే తాను ఈ రంగంలో ఎందుకు ఉన్నానో గుర్తు చేస్తాయని తెలిపింది. అభిమానులకు కృతజ్ఞతలు తెలిపింది.1996లో బెంగళూరులో జన్మించిన రుక్మిణి వసంత్ 2019లో 'బిర్బల్ ట్రయాలజీ' చిత్రంతో కన్నడ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 2023లో రక్షిత్ శెట్టి సరసన నటించిన 'సప్త సాగరదాచే ఎల్లో' రెండు భాగాలతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ చిత్రంలోని నటనకు ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డులో ఉత్తమ నటిగా పురస్కారం అందుకుంది.

ఆ తర్వాత 'బఘీరా', 'భైరతి రణగల్' చిత్రాల్లో నటించిన రుక్మిణి.. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తమిళంలో 'ఏస్', 'మదరాసి' చిత్రాలతో పాటు 'కాంతారా: చాప్టర్ 1'లో కనకవతి పాత్రలో కనిపించింది. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమల్లో తన మార్కెట్‌ను విస్తరించుకుంటోంది.

ప్రస్తుతం యశ్ హీరోగా తెరకెక్కుతున్న 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'లో మెలిసా పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' సినిమాలోనూ నటించనుంది. అలాగే నివిన్ పాలీతో కలిసి మలయాళంలో తన అరంగేట్రం చేయనున్న 'NP51'పై కూడా అంచనాలు ఉన్నాయి. వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణి వసంత్ కెరీర్ మరింత వేగంగా ముందుకు సాగుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com